PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 252 | విజయవాడ, శనివారం 15 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 15 April 2023 | Rs

అణగారినవర్గాల విముక్తికోసం పోరాడిన యోధుడు అంబేద్కర్


- గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్, సిఎం జగన్

లోపలి పేజీలో..

అంబేద్కర్ సిద్ధాంతం విశ్వజనీయం

- 125 అడుగుల విగ్రహావిష్కరణ సభలో కెసిఆర్
- మార్పు కోసం యుద్ధం చేయాలి : ప్రకాశ్ అంబేద్కర్

లోపలి పేజీలో..



ఐక్య ఉద్యమాలతో
బిజెపిని సాగనంపాలి

- ప్రజలకు ప్రకాశ్ కరత్, బినయ్ విశ్వం పిలుపు
- ప్రారంభమైన సిపిఎం, సిపిఐ ప్రచారభేరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హిందుత్వ- కార్పొరేట్ కూటమిగా సాగుతున్న బిజెపి ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో సాగనంపాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, సిపిఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం ప్రజలకు పిలుపునిచ్చారు.వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు అందుకు నడుం బిగించాలని, ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు రూపొందించుకోవాలన్నారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని, మోదీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సిపిఐ-సిపిఎం చేపట్టిన ప్రచారభేరిని విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారంనాడు వారు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం-సిపిఐ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, అనేక మండల కేంద్రాల్లో ప్రచార భేరీ ప్రారంభ సభలు, ర్యాలీలు జరిగాయి.



ప్రచారభేరి ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ప్రకాశ్ కరత్

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణలతో కలిసి ప్రకాశ్ కరత్, బినయ్ విశ్వం నివాళలర్పించారు. అనంతరం బైక్‌ర్యాలీగా ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు మీదగా ఎంబి విజ్ఞాన కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం హిందూత్వ కార్పొరేట్ కూటమి అని, ఒకవైపు దేశాన్ని హిందూ రాష్ట్రగా మార్చాలని ప్రయత్నిస్తూ మరోవైపు కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో చట్టాలు సవరించి లవ్ జీహాద్, గో రక్షక చట్టాలు పేరుతో మైనార్టీలు, దళితులు, గిరిజనులపై దాడులు చేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్లపై అదనపు పన్నులు వేయకుండా సామాన్య ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందని, ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారని తెలిపారు. ప్రజల సమస్యలు లేవనెత్తుతున్న ప్రతిపక్షల గొంతును పార్లమెంటులో నొక్కుతుందని, ఈడి, సిబిఐ, ఐటీ వంటి సంస్థలతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. భారతదేశం హిందూ రాష్ట్రగా మారడం అంటే దేశ వినాశనమే అని అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. అటువంటి అంబేద్కర్‌ను తమ సొంతం చేసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహించారు. దేశంలో బిజెపికి వ్యతిరేకంగా ఉండే లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్య ప్రజా ఉద్యమాలు సాగించాలన్నారు. కార్మికవర్గం, ఆంధ్రప్రదేశ్ ప్రజల మద్దతుతో రెండేళ్లుగా సాగుతున్న పోరాట కారణంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను కేంద్రంసాహసించలేకపోతున్నదని అన్నారు. కేంద్రం నిరంకుశ విధానాలు, రాష్ట్రాల హక్కులు హరించే విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు పోరాడుతున్నాయని తెలిపారు. కాని ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తూచ తప్పకుండా బిజెపి విధానాలను అమలు చేస్తూ కేంద్రాన్ని పల్లెత్తు మాట అనడం లేదని విమర్శించారు. బిజెపి ఆర్థిక, హిందూత్వ, కార్పొరేటీకరణ విధానాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలను కూడా ప్రజల్లో ఎండగట్టాలని కోరారు.

బినయ్ విశ్వం మాట్లాడుతూ దేశంలో మోడీ అనుసరిస్తున్న హిందుత్వ సిద్ధాంతానికి భిన్నమైన సిద్ధాంతం కమ్యూనిస్టుల దగ్గర ఉందన్నారు. మార్క్సిజం ఒక శాస్త్రమని, పెట్టుబడి అందర్నీ తన బానిసలుగా చేస్తుందని కారల్‌మార్క్స్ చెప్పారని, మోడీ ప్రభుత్వంలో అలాంటి విధానాలనే చూస్తున్నామన్నారు. అదానీ వంటి పెట్టుబడిదారులకు బానిసగా మోడీ మారిపోయారని విమర్శించారు. ఫాసిస్టు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంతో దేశాన్ని పరిపాలించేందుకు మోడీ మిగతా 2లో

విశాఖ ఉక్కు
ప్రైవేటీకరణ ఆగదు

మళ్లీ పాత పాటే పాడిన మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో, అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై కత్తిగట్టిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరో వంచనకు పాల్పడింది. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్థే గురువారం విశాఖ వచ్చి విశాఖ ఉక్కుపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలతో ప్రహసనం సృష్టించి వెళ్లారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వివరణ ఇస్తూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను నిలుపుదల చేసే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్)లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పురోగతిలోనే ఉంది. అయితే ఆర్‌ఐఎన్‌ఎల్ పని తీరును మెరుగుపరచడానికి కంపెనీ చేసే యత్నాలకు ప్రభుత్వ మద్దతు ఉంటుందని తెలిపింది. ఇప్పటికిప్పుడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేయాలని కేంద్రం అనుకోవడం లేదని, ప్లాంటును బలోపేతం చేసే ప్రయత్నాలు చేస్తున్నామని కాసేపు, ప్రైవేటీకరణను ఆపడం తన చేతుల్లో లేదని కాసేపు మాట్లాడి గందరగోళం సృష్టించిన సంగతి తెలిసిందే.

బిజెపి బండారం బట్టబయలు : సిపిఎం

విశాఖ స్టీల్‌ప్లాంటు అమ్మకాన్ని నిలిపేస్తున్నట్లు గురువారం కేంద్ర మంత్రి ప్రకటించి.. శుక్రవారం స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపేది లేదని కేంద్రం ప్రకటించడంతో బిజెపి బండారం మరోసారి బట్టబయలైందని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి కేంద్ర ప్రభుత్వ నయవంచనను తీవ్రంగా ఖండించారు. స్టీల్‌ప్లాంటుపై బిజెపి నయవంచన, అబద్ధాలు, పూటకొక మాట మార్చే ప్రకటనలపై రాష్ట్ర ప్రగతి కోరుకునే మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజలు నిరసించాలని విజ్ఞప్తి చేశారు.

స్టీల్‌ప్లాంటు గొంతు నులిమి కేంద్రం హత్య చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ మిన్నకుండడం అన్యాయమని అన్నారు. బిజెపి కుయుక్తులు తెలిసే 'ప్రజలను వంచించడం ఆపి వైజాగ్ స్టీల్‌ప్లాంటు అమ్మకాన్ని నిలిపేస్తున్నట్లు కేంద్ర మంత్రివర్గం ప్రకటించాలని' సిపిఎం గురువారం నాడే ప్రకటన చేసిందని గుర్తు చేశారు. శుక్రవారం నాటి ప్రకటనతో బిజెపి అసలు స్వరూపం స్పష్టమైందని పేర్కొన్నారు. ప్రజలను బిజెపి కేంద్ర మంత్రులు గందరగోళ పరచడానికే పార్లమెంటులో ఒక్కోసారి ఒక్కో ప్రకటన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఆపడానికి రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాలతో అఖిలపక్షం వేసి కేంద్రంతో పోరాటానికి సిద్ధపడాలని విజ్ఞప్తి చేశారు.

ఆరు సంస్థలు ఆసక్తి?

- నేడే 'ఉక్కు' ఇఒఐ బిడ్డింగ్‌కు తుదిగడువు
- సాయంత్రం వెల్లడి కానున్న వివరాలు

లోపలి పేజీలో..

'ఉక్కు' నిరసనలు

- కేంద్రం దిష్టిబొమ్మను దగ్ధం చేసిన స్టీల్ ప్లాంట్ కార్మికులు

గృహప్రవేశం వేళ విషాదం

- విద్యుదాఘాతంతో నలుగురి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- బి.కొత్తకోట, మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం (పిటిఎం)లో విద్యుదాఘాతంతో నలుగురి మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా బంధువులే. పోలీసుల కథనం ప్రకారం... పిటిఎం మండలం కానుగమాకులపల్లెలో శుక్రవారం గృహప్రవేశం జరుగుతుండడంతో ఆ ఇంటి ముందు షామియానా వేశారు. ఒక్కసారిగా గాలి రావడంతో ఈ షామియానాకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో, ఆ షామియానాలో ఉన్న వారిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో బి.కొత్తకోట మండలం కొత్తపల్లికు చెందిన లక్ష్మమ్మ (70), విజయ్ ప్రశాంత్ (25) ఉన్నారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని బి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తపల్లికు చెందిన శాంతమ్మ (48), ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వడిగలవారిపల్లెకు చెందిన లక్ష్మణ్ (53) మృతి చెందారు. మిగిలిన ముగ్గురినీ మెరుగైన వైద్యం కోసం తొలుత మదనపల్లె జిల్లా ఆస్పత్రికి, ఆ తర్వాత తిరుపతి ఆస్పత్రికి తరలించారు. గృహప్రవేశం వేళ కరెంటు తీగల రూపంలో మృతువు నలుగురిని కబళించడంతో విషాదం అలముకుంది. సంఘటనా స్థలాన్ని మదనపల్లి డిఎస్‌పి కె.కేశప్ప పరిశీలించి



లక్ష్మణ్ ప్రశాంత్ శాంతమ్మ లక్ష్మమ్మ

ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

విద్యుదాఘాతానికి గురై మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతదేహాలను జిల్లా ఆస్పత్రిలో ఆయన సందర్శించారు. హడావిడిగా పోస్ట్‌మార్టం నిర్వహించడం, అధికారుల హడావిడి చూస్తే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ సంఘటనపై సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మృతదేహాలను పరిశీలించిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు టి.హరేంద్రనాథ్ శర్మ ఉన్నారు.

వివేకా హత్య కేసులో ఉదయ్ కుమార్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపి అవినాష్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డిని పులివెందులలో సిబిఐ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కడప కారాగారం అతిథి గృహంలో విచారించారు. ఆ తర్వాత ప్రత్యేక వాహంలో



హైదరాబాదులోని సిబిఐ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం. వివేకా హత్య కేసు నిందితుడు సునీల్ కుమార్ యాదవ్ బెయిల్ పిటిషన్ కౌంటర్లో ఉదయ్ కుమార్ పేరును సిబిఐ ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాల్ డేటా, గూగుల్ టేక్ అవుట్ ఆధారంగా ఆయన పాత్ర తెలుసుకున్నట్టు సమాచారం. ఉదయ్ కుమార్‌రెడ్డిని సిబిఐ గతంలో పలుమార్లు విచారించింది. ఈ నేపథ్యంలో సిబిఐ అధికారి రామ్‌సింగ్ తనను వేధిస్తున్నారంటూ కడప జిల్లా ఎస్‌పికి ఆయన గతంలో ఫిర్యాదు చేయడంతోపాటు హైకోర్టులో పిటిషన్ కూడా వేశాడు. ఉదయ్ కుమార్‌రెడ్డి గతంలో వైఎస్ అవినాష్‌రెడ్డి వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు.

35సీట్లు ఇవ్వండి
మమత సర్కార్‌ను కూల్చేస్తాం

- బీర్భుం బహిరంగ సభలో అమిత్ షా వ్యాఖ్యలు

కోల్‌కతా : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్ నుండి 35 స్థానాలు బిజెపికి ఇవ్వండి.. 2025 నాటికల్లా మమత ప్రభుత్వాన్ని కూల్చేస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చెప్పారు. శుక్రవారం బీర్భుం జిల్లాలోని సూరిలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 2019లోక్‌సభ ఎన్నికల్లో 18 సీట్లు ఇచ్చారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 77 స్థానాలు ఇచ్చారు. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో మరో 17 సీట్లు అదనంగా ఇవ్వండి. మళ్లీ మోడీనే అధికారంలోకి వచ్చేలా చూడండి. మమత బెనర్జీ పదవీ కాలం 2026 వరకు ఉంది. అయితే ఆ పదవీ కాలం పూర్తిగాక ముందే కూలిపోతుందని అమిత్‌షా అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయిన స్థానాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. హుగ్లీలోని రిషారాలో, హౌరాలోని షిబ్‌పూర్‌లో చెలరేగిన మత ఘర్షణలకు తృణమూల్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలే కారణమని నిందించారు.



బెంగాల్ పంచాయితీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అమిత్‌షా రెండు రోజుల పర్యటన కోసం ఇక్కడికి వచ్చారు.

ముఖ్యమంత్రి మమతతో పాటూ ఆమె మేనల్లుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపైనా అమిత్ షా విరుచుకుపడ్డారు. 20నిముషాలపాటు సాగిన ప్రసంగంలో దీదీ ఔర్ భాటిజా అంటూ అత్తా, అల్లుళ్ళను పదే పదే ప్రస్తావించారు. తన మేనల్లుడిని ముఖ్యమంత్రిగా చేయడమే మమత లక్ష్యమని షా విమర్శించారు.

తృణమూల్ నేత ఇంట్లో పట్టుబడిన నోట్లకట్టలను రెండు ట్రక్కుల్లో తరలించాల్సి వచ్చిందని అన్నారు.


సీజనల్ పక్షి : తృణమూల్ కౌంటర్

అమిత్ షా ఓ సీజనల్ పక్షి లాంటివాడని తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. "బెంగాల్‌కి సీజనల్ పక్షి వచ్చింది, కానీ, ఎవరూ దాన్ని చూడాలనుకోవడం లేదు." అని ఆ పార్టీ అధికారిక ట్విట్టర్‌లో వ్యాఖ్యానించింది. 'ఢిల్లీకి వెళ్లి మీ పని మీరు చేసుకోండి. మీ చెత్త మాటలు, అబద్ధాలు, విద్వేషపూరితమైన ఎజెండా, ఎక్కడకు వెళ్ళినా విషం చిమ్మే బుద్ధి, వీటిని విశ్వసించేవారు ఎవరూ లేరిక్కడ" అంటూ అమిత్‌షా పై తృణమూల్ ధ్వజమెత్తింది.



ట్విట్టర్‌లో పోస్టులకూ డబ్బులు

న్యూఢిల్లీ : సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్‌ను ఎలన్‌మస్క్ సొంతం చేసుకున్న తర్వాత ఆ సంస్థను రోజు రోజుకు వాణిజ్యపరంగా మార్చేస్తున్నారు. వినియోగదారులు పోస్టులు చేయడం ద్వారా కూడా డబ్బులు సంపాదించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. ఎక్కువ సమాచారం, అధిక నిడివి ఉన్న వీడియోల వరకు పోస్టు చేయడం ద్వారా సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌తో రాబడి పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది. దీని కోసం సెట్టింగ్స్‌లోకి వెళ్లి మానిటైజ్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే సరిపోతుందని తెలిపింది. తొలుత దీన్ని అమెరికాలో ప్రారంభించింది. తర్వాత అన్ని దేశాలకు విస్తరించనున్నట్లు వెల్లడించింది. తాజా మార్పుల ద్వారా మరింత ఎక్కువ మంది కంటెంట్ క్రియేటర్లను ట్విట్టర్ వేదిక మీదకు తీసుకొచ్చేందుకు ఆ సంస్థ యత్నిస్తోంది.



శుక్రవారం బీజింగ్‌లోని ది గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్స్‌లో చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా కరచాలనం

డాలర్‌కు చెక్ పెడదాం

- చైనా, బ్రెజిల్ ఉద్ఘాటన
- బీజింగ్‌లో లూలా, జిన్‌పింగ్ భేటీ

5



16న విచారణకు రండి

- కేజ్రీవాల్‌కు సిబిఐ సమన్లు

వైసిపి డిపాజిట్లు రావు

- ఉచితంగా ఇసుక ఎందుకివ్వరు : చంద్రబాబు

లోపలి పేజీలో..

సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణకు
ప్రత్యేకాధికారులుగా 26 మంది ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 45 నెలల పాలనలో అమలులోకి తెచ్చిన పలు పథకాల అమలు పర్యవేక్షణ కోసం సీనియర్ ఐఎఎస్ అధికారులను నియమించాలని భావించింది. ఇందుకోసం ఒక్కో జిల్లాకు ఒక్కో ఐఎఎస్ ప్రాతిపదిక 26 మందిని స్పెషల్ ఆఫీసర్లు (ప్రత్యేకాధికారి)గా నియమించింది. ముఖ్యంగా నాడు-నేడు (పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు) నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల పనితీరును మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేకాధికారుల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రజల సమస్యలను గుణాత్మకంగా సకాలంలో పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించబోతోంది. ఈ నేపథ్యంలో జిల్లాల్లో అమలు పర్యవేక్షణ కోసం ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

స్పెషల్ ఆఫీసరు హోదా	కేటాయించిన జిల్లా
గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ సెక్రటరీ	అల్లూరి సీతారామరాజు
వైద్య,ఆరోగ్యశాఖ కమిషనరు	అనకాపల్లి
పౌర సరఫరాల సంస్థ కమిషనరు	అనంతపురం
ఆప్కాబ్ ఎమ్‌డి	అన్నమయ్య
సాంకేతిక విద్య, కమిషనరు	బాపట్ల
పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి	చిత్తూరు
సిఆర్‌డిఎ కమిషనరు	తూర్పుగోదావరి
జలవనరులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ	ఏలూరు
సెర్ప్ సిఇఒ	గుంటూరు

మిగతా 2లో

ఖాళీలు తెలపండి గ్రూప్-1, గ్రూప్-2 మినహా

● శాఖలకు ప్రభుత్వం సర్క్యులర్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉన్న ఖాళీల వివరాలు ఈ నెల 21వ తేదీలోగా ఇవ్వాలని ప్రభుత్వ శాఖలకు సాధారణ పరిపాలనశాఖ ఆదేశించింది. గ్రూప్-1, 2 మినహా మిగిలిన ఖాళీ పోస్టుల వివరాలు ఇవ్వాలని జిఎడి ఒక సర్క్యులర్‌లో కోరింది. పశు సంవర్ధకశాఖ, ఆహార పౌర సరఫరాలు, నైపుణ్యాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, అటవీ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, వైద్యారోగ్యశాఖ, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలికాభివృద్ధి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల నుంచి ఖాళీల వివరాలు తెలపాలని ఇది వరకే ఒకసారి కోరింది. తాజా సర్క్యులర్‌తోపాటు ఒక ప్రొఫార్మాను కూడా జత చేసింది.

24న జై భారత్ సత్యాగ్రహ బహిరంగ సభ

● గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ కక్ష సాధింపులు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఈ నెల 24న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో 'జై భారత్ సత్యాగ్రహ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుండటం సరైన పద్ధతి కాదన్నారు. మీడియా సమావేశంలో పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లామ్ తాంతియా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

గీతం వద్ద మళ్లీ ఉద్రిక్తత

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

గీతం యూనివర్సిటీ స్థలం విషయంలో అధికారుల తీరుతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. గీతం ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి కంచె వేసే పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎండాడ నుంచి గీతం వర్సిటీ వైపు వెళ్లే రహదారిలో, రుషికొండ కూడలి వద్ద అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి ఆంక్షలు విధించారు. ఏదైనా గుర్తింపు ఉంటేనే ఆయా మార్గాల్లో అనుమతించారు. పోలీసులు భారీగా మోహరించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు తదితరులు అక్కడకు చేరుకున్నారు. గీతం వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. వర్సిటీలో ప్రభుత్వ స్థలం ఉంటే స్వాధీనం చేసుకోవాలి తప్ప ఇబ్బంది కలిగించేలా వ్యవహరించరాదన్నారు.

ప్రభుత్వ భూమిలో కంచె వేశాం : ఆర్‌డిఒ

గీతం ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని కంచె వేసినట్టు భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఇంకా గీతం పరిధిలో 14 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ స్థలాన్నీ స్వాధీనం చేసుకుంటామన్నారు.

సమాన హక్కులు, అణగారినవర్గాల విముక్తి కోసం

పోరాడిన యోధుడు అంబేద్కర్

● గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్, సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అందరికీ సమాన హక్కులతోపాటు అణగారిన వర్గాల విముక్తి కోసం పోరాడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశం గర్వించదగిన మహోన్నత వ్యక్తి అని గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ పితామహుడు మాత్రమే కాదని, రాజ్యాంగ రచనలో ప్రధాన రూపశిల్పి అని అన్నారు. షెడ్యూల్డ్ కులాల సమాజం ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, ఆదిమూలపు సురేష్, ఎంపి నందిగం సురేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు పాల్గొన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీలక్ష్మీశా, ఫుడ్ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



అంబేద్కర్ కు నివాళులర్పిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి , తదితరులు

రబీ ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, గోనె సంచులు, రవాణా, హమాలీలు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, రబీ షెడ్యూల్‌ను తక్షణమే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యేలు ప్రకటిస్తున్నా.. ఆచరణలో ప్రారంభం కాలేదని తెలిపారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో లేవని గుర్తు చేశారు. రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ఒక వైపు ప్రభుత్వం ప్రకటిస్తూ ఆచరణలో పండిన ధాన్యంలో 60 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని ఆదేశాలిస్తోందని విమర్శించారు. ఇ-క్రాప్ నమోదులో భూ యజమానుల పేర్లు ఉండటంతో కౌలు రైతులు ధాన్యం అమ్ముకోలేకపోతున్నారని, కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాకు కేరళ ప్రభుత్వం రూ.900, ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం రూ.600 అదనంగా ఇస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని రైతులు మద్దతు ధర పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తేమశాతం లెక్కింపు, తూకాల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు. ఆర్‌బికెల్లో తేమ శాతాన్ని మిల్లర్లు అంగీకరించడం లేదన్నారు. ఆర్‌బికెలకు నిర్ణయించిన వే బ్రిడ్జి కాటా వద్ద తూకం వేసిన తర్వాత మిల్లులకు ఆ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వారే తరలించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతులకు నగదు చెల్లింపులు చేయాలన్నారు. పసుపు కనీస మద్దతు ధర రూ.6,850 కాగా రూ.4,050కు కూడా కొనేవారు లేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ మార్కెటింగ్ ఏజెన్సీల ద్వారా కనీస మద్దతు ధరలకు పసుపు, మొక్కజొన్నను కొనిపించాలని సూచించారు. నాగార్జున సాగర్ కుడి కాలువకు వారం రోజులైనా నీరు అందించాలని కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సిఎస్‌తో పంకజ్‌జైన్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డితో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ కార్యదర్శి పంకజ్‌జైన్ విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చమురు సహజ వాయువు రంగాల్లో చేపట్టే ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు, కేంద్ర పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వశాఖ అన్ని విధాలా కట్టుబడి ఉందని పంకజ్‌జైన్ స్పష్టం చేశారు. ఈ రంగంలోని ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేద్దామని అన్నారు.

రాష్ట్రంలో పెట్రోలియం, చమురు సహజ వాయువు రంగానికి సంబంధించి లైసెన్స్‌లు, క్లియరెన్స్‌ల కోసం పెండింగ్‌లోని దరఖాస్తులు, రాష్ట్రంలో పెట్రో కెమికల్ ప్రాజెక్టుల స్థాపనకు సంబంధించిన ఫీజులు, వాటి నిర్వహణ వంటి కీలక అంశాలపై చర్చించారు. వీటితోపాటు రాష్ట్రంలో వివిద దశల్లో పెండింగ్‌లో ఉన్న పెట్రోలియం మైనింగ్ లీజులు (పిఎంఎల్‌ఎస్) అన్వేషణ, ఉత్పత్తి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన అనుమతులు మంజూరుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. చమురు, గ్యాస్, మైనింగ్ ప్రాజెక్టుల ఆపరేషన్ కోసం సమ్మతి, ఇటీవల పెరిగిన ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీజులు గురించి కూడా చర్చించారు. రాష్ట్రంలో పెట్రో కెమికల్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంపై ఇరువురూ చర్చించారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని జవహర్‌రెడ్డి, పంకజ్‌జైన్ అభిప్రాయపడ్డారు.



విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం(ఎంబివికె)లో జరిగిన ప్రచార భేరి ప్రారంభ సభలో అభివాదం చేస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులు

ఐక్య ఉద్యమాలతో బిజెపిని సాగనంపాలి

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అవినీతి మచ్చలేని వారు కమ్యూనిస్టులు అని, వారికి ఈడీ, ఐటీ, సీబీఐ అంటే ఎలాంటి భయం ఉండబోదని స్పష్టం చేశారు. సిపిఐ, సిపిఎం ఎన్నికల కమిషన్ ఇచ్చే సర్టిఫికెట్లతో పనిచేయడం లేదని, ప్రజాపోరాటాలతో జనం మద్దతుతో ఈ పార్టీలు కొనసాగుతున్నాయని చెప్పారు. కమ్యూనిస్టుల ఐక్యత అత్యవసరమని, ప్రతి అంశంలోనూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఉమ్మడి పోరాటాలు అత్యవసరమని పునరుద్ఘాటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేద్కర్‌కు భారీ ఎత్తున విగ్రహాలు కట్టి, పెద్దఎత్తున ప్రభుత్వాలు ఉత్సవాల్ని నిర్వహిస్తూ, మరోవైపు దళిత, ఆదివాసీ, బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ మోడీ తొలగించారని, రిజర్వేషన్లు సరిగ్గా అమలు చేయడం లేదని, మనువాదం పేరుతో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ భూములను పెత్తందారులకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ చట్టాలను సవరణ తెస్తున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రానికి మోడీ తీవ్ర ద్రోహం చేశారని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలనపై పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవ్వాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ అధ్యక్షత వహించిన ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు పి మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి, డివి కృష్ణ, దోనేపూడి కాశీనాథ్, కార్పొరేటర్ సత్తిబాబు, నాయకులు, ప్రవీణ్, కృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.దుర్గాభవాని, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, నాయకులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగించేందుకు అంబేద్కర్ కృషి

● టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాజంలోని అసమానతలను తొలగించేందుకు బిఆర్ అంబేద్కర్ కృషి చేశారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యమైన చట్టాలను రాజ్యాంగంలో పొందుపరిచిన మేధావి అని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే దళితులకు టిడిపి అన్ని విధాలా ప్రాముఖ్యతనిచ్చిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేయాలనే ఆలోచనతో టిడిపి హయాంలో అమరావతిలోని శాఖమూరును పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతూ.. రూ.100 కోట్లతో 20 ఎకరాల్లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, లైబ్రరీ, పార్కుతో కూడిన ఆయన పేరుతో స్మృతివనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఏ ఊరిలో అభివృద్ధి పనులు చేపట్టినా మొదటగా దళితవాడ నుంచి మొదలెట్టే సంప్రదాయాన్ని తెచ్చామని తెలిపారు.

టిడిపి కార్యాలయంలో..

టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కె జవహర్, తెలుగు మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత, నాయకులు పిల్లి మాణిక్యాలరావు, బుచ్చి రామ్‌ప్రసాద్ తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

● ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టరు శ్రీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టరు శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆప్కాబ్ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను అందరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. సిఎస్ఆర్ కింద వెనుకబడిన గ్రామంలో సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ సిజిఎం రాజయ్య, జిఎం కృష్ణారావు, రామచంద్రయ్య, రామ్‌ప్రసాదు, డిజిఎంలు షఫీ, ప్రశాంతి, ఝాన్సీ తదిరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేద్కర్

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిఒఒ కిరణ్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిఒఒ ఎన్ కిరణ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ మేధావుల్లో అంబేద్కర్ అగ్రగణ్యుడని అన్నారు. పేదరిక నిర్మూలన, సమానత్వం, మహిళల హక్కుల కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని తెలిపారు.



నూజివీడులో చంద్రబాబు రోడ్‌షో

వైసిపి డిపాజిట్లు రావు

● ఉచితంగా ఇసుక ఎందుకివ్వరు : చంద్రబాబు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, గుడివాడ (కృష్ణా జిల్లా)

జనంలో ఉత్సాహం... చైతన్యం చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో వైసిపికి డిపాజిట్లు వస్తాయా అంటూ చంద్రబాబు అన్నారు. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో చంద్రబాబు పర్యటించారు. నూజివీడు నియోజకవర్గం మర్రిబందం గ్రామం నుంచి నూజివీడు పట్టణం వరకూ రోడ్డు షో నిర్వహించారు. దారి పొడవునా పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. నూజివీడులో చంద్రబాబు మాట్లాడుతూ ఇంత రాత్రి వరకు కూడా చిన్నపిల్లలను భుజాలపై ఎక్కించుకుని స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. మీ పిల్లల భవిష్యత్తు నాదని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో రైతులు కూలీలు, తోపుడు బళ్లవారు, కార్మికులు అందరూ దెబ్బ తిన్నారన్నారు. అరాచకం పెరిగిపోయిందని, నిత్యావసర ధరలు పెరిగాయని విమర్శించారు. ఎనిమిదిసార్లు విద్యుత్తు ఛార్జీలు, ఆర్‌టిసి ఛార్జీలు పెంచారన్నారు. మద్యపాన నిషేధమని చెప్పి మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెస్తున్నారని దుయ్యబట్టారు. మద్యంలో వచ్చే పర్సంటేజులు జగన్, వైసిపి ఎంఎల్‌ఎలు దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్నది చాలు, ఇసుక ఉచితంగా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కోడికత్తి డ్రామా అబద్ధమని తేలిపోయిందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. విశాఖలో రామానాయుడి భూములు దోచుకోవడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. మార్గదర్శిపై తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి గంజాయి బ్యాచ్ వచ్చిందని, వైసిపికి ఓటు వేస్తే అంధకారమేనని అన్నారు. జగనే మా భవిష్యత్తు కాదని, జగనే మా దరిద్రం అని అన్నారు. మామిడి రైతులను అన్నివిధాల ఆదుకుంటామన్నారు. చింతలపూడిని పూర్తి చేసి ప్రతి ఎకరాలకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. నూజివీడులో ఎంఎల్‌ఎ కుమారుడు దుకాణం పెట్టేశారని, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే అన్న చందంగా తయారయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అసమానతలు లేకుండా చేయడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

అంతకు ముందు కృష్ణా జిల్లా గుడివాడలోని వికెఆర్, వినెబి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చరిత్ర నేటి యువతకు స్ఫూర్తినిస్తుందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు లేకుండా చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళని పేర్కొన్నారు. అనంతరం ఫార్టర్లతో చంద్రబాబు సమావేశమయ్యారు.



జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా నాగబాబు

● జాతీయ మీడియా ప్రతినిధిగా అజయ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొణిదెల నాగబాబు, జాతీయ మీడియా ప్రతినిధిగా నెల్లూరు జిల్లాకు చెందిన వేములపాటి అజయ్‌కుమార్‌ను ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు.

యుజిసి కొత్త నిబంధనలు గందరగోళం

● సాధారణ ఫిర్యాదుల సెక్షన్‌లోకి కుల వివక్ష కంప్లైంట్‌లు

● విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) కొత్త నిబంధనలు గందరగోళానికి గురి చేస్తున్నాయి. కులాధారిత వివక్షకు సంబంధించిన ఫిర్యాదులను సాధారణ కంప్లైంట్‌ల సెక్షన్‌లోకి చేర్చింది. అయితే, విద్యాసంస్థల్లో కుల వివక్షను నిరోధించడానికి తీసుకొచ్చిన నిబంధనలను ఇది నీరు గారుస్తుందన్న భయాందోళనలు విద్యావేత్తలు, నిపుణుల నుంచి వ్యక్తమయ్యాయి. ప్రతి విద్యాసంస్థ తప్పనిసరిగా విద్యార్థుల సమస్యల పరిష్కార కమిటీ (ఎస్‌జీఆర్‌సీ)ని ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని నిబంధనలను యూజీసీ ఇటీవల కొత్తగా తీసుకొచ్చింది. విద్యార్థుల సమస్యల విషయంలో ఈ ఎస్‌జీఆర్‌సీ దృష్టిని సారిస్తుంది. ఎస్‌జీఆర్‌సీ పరిధిలో కులాల ఆధారంగా విద్యార్థులపై వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ప్రతి ఇన్‌స్టిట్యూషన్ విద్యార్థుల ఫిర్యాదులను వినేలా అంబుడ్స్‌పర్సన్‌ను (రిటైర్డ్ వైస్ చాన్సలర్ లేదా రిటైర్డ్ ప్రొఫెసర్ లేదా జిల్లా మాజీ జడ్జి) తప్పక నియమించాల్సి ఉంటుంది. యూజీసీ 2012 నిబంధనల ప్రకారం ప్రతి ఉన్న విద్యా సంస్థలో వివక్ష వ్యతిరేక అధికారి నేతృత్వంలోని సమాన అవకాశ సెల్ (ఈఓసీ) తప్పక కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల విషయంలో కుల వివక్షకు సంబంధించిన ఫిర్యాదులను ఈ సెల్ విచారించేది. అయితే, కొత్త నిబంధనల ప్రకారం ఈ సెల్ రద్దు చేయబడుతుందా? లేదా అన్నదానిపై మాత్రం ఎలాంటి స్పష్టతా లేదని తెలిసింది. కొత్త నిబంధనలు అనవసర గందరగోళాన్ని సృష్టిస్తాయని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్. సుకుమార్, యూజీసీ మాజీ అధిపతి సుఖడియో తొరట్, ఇతర విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ సమస్యలతో కుల వివక్ష ఫిర్యాదులను కలపకూడదని అన్నారు.

సంబరాలు సరే... ఇళ్లేవీ?

● టిడ్కో ఇళ్ల పంపిణీకి మీనమేషాలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల పంపిణీ పేరిట పది రోజుల సంబరాలు చేపట్టి దాదాపు పది నెలలు కావస్తోంది. వాటి అప్పగింతకు మాత్రం ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో, లబ్ధిదారులు తీవ్ర నిరాశకు, అయోమయానికి గురవుతున్నారు. పట్టణ పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2.62 లక్షల టిడ్కో గృహాలను గత ప్రభుత్వం చేపట్టిన విషయం విదితమే. అప్పట్లో వీటిని పూర్తి చేయకుండానే లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అర్హత పత్రాలను రద్దు చేసి, వాటి స్థానే వైసిపి బొమ్మలు, రంగులతో కూడిన పత్రాలను లబ్ధిదారులకు ఇచ్చింది. అప్పట్లోనే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలంటూ సిపిఎం, ఇతర పార్టీలు ఆందోళనకు దిగాయి. దీంతో, టిడిపి హయాంలో ఆ పార్టీ కార్యకర్తలు, అనుయాయులకు కేటాయించారనే విమర్శలతో కొంతకాలం వైసిపి ప్రభుత్వం కాలయాపన చేసింది. గృహ నిర్మాణాలు పూర్తి కాలేదని, గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాక పంపిణీ చేస్తామని మరికొంత కాలం చెప్పుకొచ్చింది. ఇలా మూడేళ్లు గడిచినా ఇళ్లు అప్పగించకపోవడంతో లబ్ధిదారుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగి సిపిఎం తదితర పార్టీల ఆధ్వర్యాన ఏడాది క్రితం మరోమారు ఆందోళనకు దిగారు. దీన్ని చల్లార్చేందుకు ప్రభుత్వం విజయనగరం జిల్లా కేంద్రంలోని సారిపల్లిలో తలపెట్టిన టిడ్కో గృహ సముదాయంలో గతేడాది జూన్ 23న ఇళ్ల పంపిణీ ప్రారంభ సభ పెట్టింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ హాజరయ్యారు. గృహ సముదాయంలో పూజలు, పలువురికి పట్టువస్త్రాల పంపిణీ, సహపంక్తి భోజనాలు చేపట్టిన మంత్రులు పది రోజుల పాటు టిడ్కో సంబరాలు చేపట్టాలని ఆదేశించారు. కథ అంతటితోనే ముగిసిపోయింది. ఇళ్ల అప్పగింత మాత్రం జరగలేదు. మొత్తంగా టిడ్కో ఇళ్లన్నీ గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయినా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు సర్కారు తాత్సారం చేస్తోందంటూ టిడిపి విమర్శలు గుప్పిస్తోంది.

విజయనగరం జిల్లాలో పరిస్థితి ఇది

విజయనగరం పరిధిలోని సారిపల్లిలో 2,656, సోనియా నగర్‌లో 1,120, నెల్లిమర్ల మండల కేంద్రంలో 576, బొబ్బిలిలో 1680, రాజాంలో 336 చొప్పున మూడు కేటగిరిల్లో మొత్తం 6,368 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో ఇప్పటి వరకు సారిపల్లిలోని సగానికి సగం ఫ్లాట్లకు మాత్రమే రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్తు సదుపాయం వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. అనర్హత పేరిట చాలామందిని తొలగించినట్టు వైసిపి నాయకులు ప్రచారం చేస్తుండడం, మరోవైపు మొత్తం లబ్ధిదారుల తుదిజాబితా ఇప్పటికీ బహిర్గతం చేయకపోవడం వంటి కారణాలతో లబ్ధిదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

నెలనెలా డబ్బులు చెల్లిస్తున్నా ఇల్లు అప్పగించలేదు

నెలనెలా రూ.2,500 చొప్పున డబ్బులు చెల్లిస్తున్నాను. ఇప్పటికీ ఇల్లు మాత్రం అప్పగించలేదు. వాస్తవానికి చంద్రబాబు పాలనలో ఇంటికి సంబంధించిన అలాట్‌మెంట్ పత్రాలు నా పేరున ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నా పేరుకు బదులు నా భార్య పేరుపై ఇచ్చింది. నెలకోసారి ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌పాసు పుస్తకాల జిరాక్స్‌లు, ఫొటోలు అడుగుతున్నారు. అవి తీసుకోవడమే మిగిలింది తప్ప, ఇప్పటికీ ఇల్లు అప్పగించలేదు. ఇంటి అద్దె కట్టలేక, ఇంటికి డబ్బులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

- సబ్బారపు బుచ్చినాయుడు, టిడ్కో లబ్ధిదారుడు, ఉడా కాలనీ, విజయనగరం

సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులుగా 26 మంది ఐఎఎస్‌లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ	కాకినాడ
బిసి, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ	డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ
ఎపిఎస్‌హెచ్‌సిఎల్ ఎమ్‌డి	కృష్ణా
టిఆర్‌అండ్‌బి ప్రభుత్వ సెక్రటరీ	కర్నూలు
ఐ.టి.ఇ అండ్‌సి డిపార్టుమెంట్ ప్రభుత్వ సెక్రటరీ	నంద్యాల
వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనరు	ఎపిఎస్ నెల్లూరు
కమర్షియల్ ట్యాక్స్ కమిషనరు	ఎన్‌టిఆర్
పంచాయతీరాజ్ కమిషనరు	పల్నాడు
స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ	పార్వతీపురం మన్యం
హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ	ప్రకాశం
ఎపి జెన్కో ఎమ్‌డి	శ్రీసత్యసాయి
సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనరు	శ్రీకాకుళం
హయ్యర్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్ సెక్రటరీ	తిరుపతి
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కమిషనరు అండ్ డైరెక్టర్	విశాఖపట్నం
పాఠశాల విద్య కమిషనరు	విజయనగరం
ఫిషరీస్, కమిషనరు	పశ్చిమ గోదావరి
ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి	వైఎస్ఆర్

'ఉక్కు' నిరసనలు

కేంద్రం దిష్టిబొమ్మను దగ్ధం చేసిన స్టీల్ ప్లాంట్ కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపేది లేదంటూ కేంద్రం చేసిన ప్రకటనపై విశాఖలో నిరసనలు వెల్లువెత్తాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన స్టీల్ కార్మికులు శుక్రవారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కూర్మన్నపాలెం కూడలిలో కేంద్రం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇటీవల బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ ఉక్కు శిబిరం వద్దకు వచ్చి పోరాటానికి మద్దతు తెలియజేసిన సమయంలో ఆ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ జెండాలను బిజెపి నాయకులు తొలగించారు.


కేంద్రం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ఆ చర్యకు నిరసనగానూ, కేంద్రం చేసిన స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రకటనకు వ్యతిరేకంగానూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేంద్రం దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ పోరాట కమిటీ నేతలు దీక్షా శిబిరం వద్ద దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి అంటే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడటమేగానీ.. ఇలా జెండాలు తొలగించడం కాదన్నారు. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గకపోవడం దారుణమన్నారు. పోరాటాలతో సాధించుకున్న ప్లాంట్‌ను పోరాటాలతోనే రక్షించుకుంటామని స్పష్టం చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జై భీమ్, జై జై భీమ్ నినాదంతో కూర్మనపాలెంలో హీలియం బెలూన్‌ను వదిలారు. ముఖ్య అతిథిగా దువ్వాడ సిఐ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా కార్మికులు ధృడ సంకల్పంతో పోరాటం చేస్తున్నారని తెలిపారు.

ఆరు సంస్థలు ఆసక్తి?

- నేడే 'ఉక్కు' ఇఒఐ బిడ్డింగ్‌కు తుదిగడువు
- సాయంత్రం వెల్లడి కానున్న వివరాలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు తక్షణం అవసరమైన ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా ఇఒఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) బిడ్డింగ్‌కు శనివారం ఆఖరి రోజు కావడంతో అందరి దృష్టి అటువైపే ఉంది. ముడిసరుకైన కొకింగ్ కోల్, ఐరన్ ఓర్ సరఫరా, కనీసం రూ.1000 కోట్ల పెట్టుబడి అత్యంత అవసరంగా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం భావిస్తోంది. ఆ దిశగా పలు ప్రయత్నాలు ప్రారంభించింది. శనివారం సాయంత్రం ఇఒఐ బిడ్లను యాజమాన్యం తెరవనుంది. ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ కోసం బిడ్‌లు 5 లేదా 6 బిడ్లు పడే అవకాశం ఉన్నట్లు, తెలంగాణ ప్రభుత్వం తరుపున సింగరేణి సంస్థ బిడ్ వేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ సంస్థ అధికారులు ఈ నెల 11న స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి అధికారులతోనూ, యూనియన్ నాయకులతోనూ సమావేశమయ్యారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై వెనక్కి తగ్గేది లేదని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం మరోసారి తేల్చి చెప్పింది. అయినా, స్టీల్ కార్మికులను, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను బిజెపి నాయకులు కొనసాగిస్తున్నారు. విశాఖపట్నం నుంచి 2024 సాధారణ ఎన్నికల్లో ఎంపిగా బరిలోకి దిగాలని చూస్తోన్న జివిఎల్.నరసింహారావు శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సిఎండితో గంటపాటు ప్లాంట్‌లో సమావేశమయ్యారు. తక్షణం ఉత్పత్తిలోకి ప్లాంట్‌ను తీసుకొచ్చి రానున్న రోజుల్లో లాభాల్లోకి తెచ్చే ప్రయత్నం చేయాలంటూ సిఎండికి ఆయన ఉచిత సలహా ఇచ్చారు. బయట వ్యక్తులకు ఇఒఐలో అవకాశం ఇవ్వొద్దంటూ సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. అంటే, అంతర్గత వనరుల ద్వారా ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ సమకూర్చుకోవాలన్నదే జివిఎల్ మాటల సారాంశంగా ఉంది. అయితే, ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ కోసం కేంద్రం వద్ద సిఫార్సు చేస్తానన్న మాట ఆయన నుంచి రాలేదు. అంతర్గత వనరులు అంటే బ్యాంకు గ్యారెంటీతో అప్పు స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వాల్సింది ప్రభుత్వమే. కేంద్రం వద్ద దీనిపై ప్రస్తావించకుండా సిఎండితో చర్చలు జరిపితే ఏం లాభం? అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. స్టీల్‌ప్లాంట్ సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులకు పెంచాలంటే ఐరన్ ఓర్, కొకింగ్ కోల్ సరఫరా జరగాలి. లాభాల్లోకి రావాలంటే రూ.1000 కోట్ల వర్కింగ్ కేపిటల్ సమకూర్చాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. నిజంగా చిత్తశుద్ధి ఉంటే బ్యాంకు గ్యారెంటీకైనా ఆంధ్రప్రదేశ్‌లోని బిజెపి నేతలు కేంద్రాన్ని ఒప్పించి స్టీల్‌ప్లాంట్‌కు అప్పు ఇప్పించి ఉండేవారని కార్మికులు అంటున్నారు. గురువారం విశాఖ వచ్చిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పూటకో మాట మాట్లాడి ఢిల్లీకి వెళ్లిపోవడంపై శుక్రవారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు నిరసన తెలిపారు. ప్లాంట్ ప్రయివేటీకరణ కొనసాగుతుందన్న కేంద్రం తాజా ప్రకటనపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపేస్తున్నట్టు స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

ఎర్రచందనం దుంగలు, గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఐదుగురు స్మగ్లర్లను కడప జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. 23 దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్‌పి అన్బురాజన్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఓ కారును తనిఖీ చేశారు. ఆ కారులోని 23 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లరు గుమ్మల వెంకటేష్‌తో పాటు దినేష్, సాయి, రాజశేఖర్, రమణయ్యలను అరెస్టు చేశారు. వీరందరూ అన్నమయ్య జిల్లాకు చెందిన వారని ఎస్‌పి తెలిపారు. ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 22.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అంబేద్కర్ సిద్ధాంతం విశ్వజనీయం

- 125 అడుగుల విగ్రహావిష్కరణ సభలో కెసిఆర్
- మార్పు కోసం యుద్ధం చేయాలి : ప్రకాశ్ అంబేద్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

' అంబేద్కర్ విగ్రహం కాదు..ఒక విప్లవం, ఆయన తెలంగాణ కలల సాకార దీపిక. బాబాసాహెబ్ విశ్వమానవుడు. ఆయన సిద్ధాంతం విశ్వజనీయం. అంబేద్కర్ ఆశయాల సాధనకోసం తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది.' అని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి కెసిఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కెసిఆర్ మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70 ఏళ్లు దాటినా దళితులకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లలో దళితుల అభివృద్ధి కోసం రూ. లక్షా 25వేల కోట్లు ఖర్చు చేశామని, ఏటా రూ.25లక్షల దళిత కుటుంబాలకు దళిత బంధు ఇచ్చి తీరుతామని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న వారిని గౌరవించుకునేలా.. ప్రతిఏటా రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ అవార్డు అందజేస్తుందని ప్రకటించారు. ప్రకాశ్ అంబేద్కర్ మాట్లాడుతూ.. దేశంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమవుతున్నాయని, మార్పు కోసం యుద్ధం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఉందని అన్నారు. దేశంలో మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలు మాత్రమే లేవని కులపరమైన మైనార్టీలు కూడా ఉన్నారని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తితో కార్యాచరణ మొదలు పెట్టి దేశ వ్యాప్తంగా ఉద్యమించాలని కోరారు. అనంతరం బేస్ భవన్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పిడిసిఎల్ సిఎండిగా సంతోషరావు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఎస్‌పిడిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కె. సంతోష్‌రావును నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఇపిడిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం ఎపిఇపిడిసిఎల్ సిఎండిగా ఐ. పృథ్వీతేజ్‌ను నియమించడంతో ఎస్‌పిడిసిఎల్ పూర్తి బాధ్యతలను సంతోషరావు చేపట్టారు.

పన్నులను ప్రక్షాళన చేస్తాం

- వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే పగలగొట్టండి
- యువగళం యాత్రలో లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రజలపై వైసిపి ప్రభుత్వం విపరీతమైన భారాలు మోపిందని, తాము అధికారంలోకి రాగానే పన్నుల ప్రక్షాళన చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీనిచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర 70వ రోజు నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో సాగింది. ముందుగా ప్యాపిలి మండలం గుడిపాడు క్యాంప్ సైట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి లోకేష్ నివాళులు అర్పించారు. అక్కడి నుంచి యాత్ర ప్రారంభించారు. పులదొడ్డి, మాన్ దొడ్డి వద్ద మామిడి రైతులతో మాట్లాడారు. పాదయాత్ర 900 కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా ప్యాపిలిలో మైలురాయిని ఆవిష్కరించారు. ప్యాపిలి శివారులో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది జనవరిలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుల చేస్తామని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడానికి వస్తే మీటర్లను పగలగొట్టాలని, టిడిపి అండగా ఉంటుందన్నారు. బిసిల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. మైనింగ్ యాజమానుల నుండి ఆర్థిక మంత్రి బుగ్గన డబ్బులు వసూలు చేశారని, క్రషర్ యజమానులను కూడా బెదిరిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, పంట నష్టపోయిన వారిని కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ధరల స్థిరీకరణ కోసం రూ.మూడు వేల కోట్లు కేటాయిస్తానని జగన్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మామిడి బోర్డు, స్టోరేజీ గోడౌన్ ఏర్పాటు గురించి ఆలోచిస్తామని చెప్పారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, ఎమ్మెల్సీ బిటి నాయుడు పాల్గొన్నారు. పొలిమేర వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రం వద్దకు యాత్ర చేరుకుంది. శనివారం పొలిమేర నుంచి యాత్ర ప్రారంభం కానుంది.



నంద్యాల జిల్లా ప్యాపిలి సభలో మాట్లాడుతున్న లోకేష్

ఐఎన్ఎస్ సహ్యాద్రి, కద్మత్‌కు ఉత్తమ నౌకల అవార్డు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తూర్పు నౌకాదళంలోని ఫ్లీట్ అవార్డుల ఫంక్షన్ (నౌకల ఉత్సవం-2023)లో భాగంగా ఉత్తమ నౌకలుగా ఐఎన్ఎస్ సహ్యాద్రి, కద్మత్ ఎంపికైనట్లు నౌకాదళాధిపతి బిశ్వజిత్ దాస్ గుప్తా శుక్రవారం వెల్లడించారు. గడిచిన ఏడాదిలో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ నౌకలకు ఈ సత్కారం లభించిందని తెలిపారు. ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ సుమేధ ఉత్తేజ పూరిత నౌకలుగా ఎంపికయ్యాయని అన్నారు. ఆపరేషనల్ కార్యక్రమాల్లోనూ, తీర ప్రాంత భద్రతలను కాపాడడంలోనూ కీలకపాత్ర పోషించాయని తెలిపారు. నేవల్ ఆపరేషన్స్‌లోనూ విస్తృతంగా పాల్గొన్నాయన్నారు. తూర్పునౌకాదళానికి చెందిన కద్మత్, సహ్యాద్రి జపాన్ - ఇండియా నౌకాదళ విన్యాసాలు, సింబెక్స్ (సింగపూర్ - ఇండియా), ఇండో పసిఫిక్, ఆస్ట్రేలియా విన్యాసాల్లోనూ పాల్గొన్నట్లు చెప్పారు. ఇతర దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను మెరుగుపరిచే కృషిని ఈ నౌకలు కొనసాగిస్తున్నాయని వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్ గుప్తా వెల్లడించారు. రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చారు.


బెస్ట్ షిప్ అవార్డు అందజేస్తున్న బిశ్వజిత్ దాస్ గుప్తా

దళితవాడలను మహనీయుల పేర్లతో పిలవండి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలోని దళితవాడలను మాల పల్లె, మాదిగ పల్లె అంటూ కులాల పేర్లు కాకుండా మహాత్ములు, మహనీయుల పేర్లు పెట్టాలని, ఆ పేర్లతోనే పిలవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి శుక్రవారం అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగంలోని పంచాయతీ రాజ్ చట్టం 126 ప్రకారం దళితవాడలకు పేర్లు పెట్టుకోవచ్చని, దీని ప్రకారం రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామంలో ఉన్న మాలపల్లెను అంబేద్కర్‌నగర్‌గా నామకరణ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎంవి భాస్కరరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వడ దెబ్బకు వ్యవసాయ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కోడూరు (కృష్ణా జిల్లా)


సుబ్బారావు

వరి కుప్ప నూర్పిడి పనికి వెళ్లి వడదెబ్బకు వ్యవసాయ కార్మికుడు మరణించిన సంఘటన కృష్ణా జిల్లా కోడూరులో శుక్రవారం చోటుచేసుకుంది. కోడూరు గ్రామ పదో వార్డుకు చెందిన వేములవాడ సుబ్బారావు (70) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే వరికుప్ప నూర్పిడి పనికి వెళ్లగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. తోటి కూలీలు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుబ్బారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

దళితులపై పెత్తందారుల దాడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అంబేద్కర్ జయంతి రోజునే దళితులపై పెత్తందారులు దాడిచేసిన ఘటన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం నెన్నూరులో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు... అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని నెన్నూరు పక్కనే ఉన్న ఐవై కాలనీ దళితవాడ కమ్యూనిటీ హాలులో పలువురు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మురళి, మణికంఠలకు చెందిన ఆటో, స్కూటర్లు రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. 'మాది...కు అధికారం ఇస్తే ఇలాగే ఉంటుంది, ముందు బండ్లు తీయండ్రా' అంటూ నెన్నూరుకు చెందిన టిడిపి మాజీ వైస్ ఎంపిపి మధుసూదన్‌రెడ్డి అనుచరులు దళితులను కులం పేరుతో దూషించారు. మురళి, మణికంఠలపై దాడికి పాల్పడ్డారు. వైసిపిలో చేరి రాజకీయాలు చేస్తున్నారా? అంటూ బూతులు తిట్టారు. తమకు న్యాయం చేయాలని రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. సాయంత్రం అయినా కేసు నమోదు చేయకపోవడంతో సిపిఎం, మాదిగ మహాజన నాయకుల ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ ముందు బాధితులకు మద్దతుగా నిరసన తెలిపారు. కేసు నమోదు చేసి ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. ఎస్ఐ గిరిధర్ కేసు నమోదు చేశారు.

సంపాదకీయం

ఉక్కుపై తుక్కు చేష్టలు

విశాఖ ఉక్కు విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనునిత్యం వంచనలకు పాల్పడుతూనేవుంది. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ఏకంగా ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్న మోడీ సర్కార్ ఇప్పటికే పోర్టులు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, అంతరిక్షయానం, రక్షణ రంగం నింగి నేలా హద్దే లేకుండా క్రోనీ మిత్రులకు కట్టబెట్టేస్తోంది. జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి), ఐడిబిఐ వంటి విత్త సంస్థలనూ పప్పులు బెల్లాల్లా కారుచౌకగా పంచేస్తోంది. పోరాటాలు, త్యాగాలతో పురుడుపోసుకొని తెలుగు ప్రజల జీవనగమనంలో మమేకమైన విశాఖ ఉక్కుపైనా కేంద్ర ప్రభుత్వం తన తుక్కు చేష్టలను కొనసాగిస్తోంది. తాజాగా ప్రయివేటీకరణ నుంచి వెనక్కి తగ్గినట్టు కొత్త నాటకానికి తెరలేపి.. అబ్బే అదంతా ఉత్తిదే అంటూ మరోమారు నిస్సిగ్గుగా వంచనకు పాల్పడటం అమానుషం. ఈ నెల 13న విశాఖపట్టణంలో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే విశాఖ ఉక్కును రాత్రికి రాత్రే ప్రయివేటీకరణ చేసేయ్యబోమంటూ నిండు సభలో బహిరంగ ప్రకటన చేశారు. అదే రోజు సాయంత్రం విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఆయనను కలిసి ప్రయివేటీకరణ కోసం వేసిన అధ్యయన కమిటీలను రద్దు చేయండంటూ విన్నవిస్తే ..ప్రయివేటీకరణ అంశం నా ఒక్కడి చేతిలోనిది కాదంటూ ఉదయం చెప్పిన మాటలకు విరుద్ధంగా కులస్తే కుచ్చుటోపి పెట్టారు. జనాలను నమ్మించడానికి బయట ఏవేవో చెబుతాం..అవన్నీ సీరియస్‌గా తీసుకొంటే ఎలా? అన్నట్టుంది ఆయన తీరు. కులస్తేతో కేంద్రం ఆడించిన ఈ నాటకంపై మీడియాలో కథనాలు రావడంతో విశాఖ ఉక్కు చట్టూ అలజడి మొదలైంది. దీంతో ఇదేదో తిరకాసు వ్యవహారంగా మారుతోందని భావించిన కేంద్ర ఉక్కు శాఖ ..విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ ఆగే ప్రసక్తే లేదని ప్రకటించి తన గోముఖం చాటునున్న వ్యాఘ్ర రూపాన్ని బయటపెట్టుకుంది.

మతోన్మాదాన్ని రాజేసి ప్రజల ఐక్యతను దెబ్బతీయడం..ఆర్థిక భారాలు మోపి వారిని మరింత కుంగదీయడం, కష్టాల ఊబిలో జనం విలవిల్లాడుతుంటే..అడిగేవాడ్వెడూ ఉండదని ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెట్టే దుర్మార్గపు కుట్రకు మోడీ సర్కార్ పెట్టుకున్న ముద్దు పేరే డిజిన్వెస్ట్‌మెంట్. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు నెరవేర్చకుండా ఆంధ్రప్రదేశ్‌ను ఇప్పటికే నిండా ముంచిన మోడీ సర్కార్ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణనైనా తక్షణం విరమించుకోవాలి. కులస్తే ప్రకటనతో.. చూశారా కేంద్రానికి రాష్ట్రంపై ఎంత ప్రేమో! అంటూ గొప్పలకు పోయిన బిజెపి రాష్ట్ర నాయకుల పరిస్థితి ఒక్క రోజు గడవకముందే కుడితిలో పడిన ఎలుక చందంగా తయారైంది. కేంద్ర మంత్రి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా కేంద్రం తీరుపై తన వైఖరిని స్పష్టం చేయాలి. వంచనకు పాల్పడిన బిజెపి పంచనే కొనసాగుతారో..బయటకు వచ్చి ద్రోహాన్ని నిలదీస్తారో? ఆయనే తేల్చుకోవాలి. విశాఖ స్టీల్‌ను ప్రయివేటుకు కట్టబెట్టడంలో నిమగ్నమైవున్నది కేంద్ర ప్రభుత్వమే అని తెలిసినా..కేంద్రాన్ని పల్లెత్తు మాట అనకుండా ఎంతసేపూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ కాలం వెళ్ల దీస్తున్న టిడిపి కూడా విశాఖ విషయంలో పునారాలోచన చేయాల్సిన అవసరం ఉంది.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రక్రియను ప్రకటించినా కేంద్రం వేగంగా ముందుకెళ్లలేక పోవడానికి రెండేళ్లుగా రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మికవర్గం సాగిస్తున్న పోరాటమే కారణం. దీర్ఘకాలిక ఐక్య పోరాటాలతోనే మోడీ సర్కార్‌ను వెనక్కికొట్టడం సాధ్యమని ఢిల్లీ రైతు ఉద్యమం పాఠం నేర్పింది. అదే మన ముందున్న మార్గం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలనూ, కార్మిక సంఘాలనూ సంప్రదించి, ఢిల్లీకి అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని నినదించి 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కేంద్రం మెడలు వంచాలి.

సందర్భం



సన్మానం పొందటంలో గొప్పదనం లేదు.
దానిని పొందటానికి
నీకున్న అర్హత లోనే గొప్పదనం ఉంది.
- అరిస్టాటిల్

కేరళలో క్రైస్తవుల పట్ల బిజెపి కుయుక్తులు

వ్యాఖ్య

ఈస్టర్ డే నాడు ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీ లోని పవిత్ర హార్ట్ కేథడ్రల్ చర్చిని సందర్శించడం గుర్తించుకోదగ్గ పరిణామం. తొమ్మిదేళ్ళ క్రితం ప్రధాని అయిన దగ్గర నుండి మోడీ చర్చిని సందర్శించడం ఇదే ప్రథమం. అదే రోజు అంటే ఈస్టర్ సండే నాడు బిజెపి నేతలు కూడా వివిధ ప్రాంతాల్లో చర్చి నేతలను కలుసుకున్నారు, వారి ఇళ్ళకు వెళ్ళి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియచేశారు.

క్రైస్తవుల పట్ల అకస్మాత్తుగా మారిన ఈ వైఖరి చాలామందిని విస్మయపరిచింది. అయితే ఈ చర్య తీసుకోవడానికి వెనుక గల కారణం, ఉద్దేశ్యాలను కూడా మోడీని సూచనప్రాయంగా తెలిపారు. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బిజెపి ప్రధాన కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకుంటున్న మద్దతుదారులను, కార్యకర్తలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ...క్రైస్తవులు ప్రాబల్యంగా వుండే మేఘాలయ, నాగాలాండ్‌లో బిజెపి ఎలా విజయం సాధించిందో వివరించారు. అంటే క్రైస్తవులకు కూడా బిజెపి ఆమోదయోగ్యం అవుతోందనడానికి ఇదొక సంకేతమని చెప్పుకున్నారు. ఇక బిజెపి తదుపరి గురి, లక్ష్యం కేరళనే అని ప్రకటించారు. అసలు మేఘాలయ, నాగాలాండ్‌లో క్రైస్తవుల మద్దతు వుందని చెప్పుకోవడమంతా బూటకం. ఎందుకంటే, మేఘాలయ అసెంబ్లీలో 60 సీట్లకు గాను బిజెపి రెండు సీట్లే గెలుచుకోగలిగింది. నాగాలాండ్‌లో పాలక సంకీర్ణంలో జూనియర్ భాగస్వామిగా వుంది.

జనాభాలో ముస్లింలు, క్రైస్తవులు కలిపి 45 శాతం వుండే కేరళలో పెద్దగా విజయం సాధించకపోయినా నిలదొక్కుకునేందుకు బిజెపి తీవ్రంగా యత్నిస్తోంది. ముస్లిం జనాభాలో పెద్దగా పురోగతి సాధించలేమని గ్రహించిన బిజెపి క్రైస్తవుల్లోనైనా కొంత ప్రభావాన్ని చూపగలగాలని భావిస్తోంది. కేరళ జనాభాలో 18 శాతం మంది ముస్లింలే వున్నారు.

ఇందుకుగాను, రెండంచెల వ్యూహాన్ని ఆమోదించింది. క్రైస్తవ కమ్యూనిటీలో ముఖ్యంగా కేరళలో సైరో-మలబార్ చర్చిగా చిరపరిచితమైన కేథలిక్ చర్చిలో ముస్లిం వ్యతిరేక భావాలు రెచ్చగొట్టేందుకు యత్నించడం ఇందులో మొదటిది. ఇటీవల కాలంలో, కొంతమంది చర్చి నేతలు లవ్ జిహాద్ గురించి వ్యతిరేకంగా మాట్లాడారు. క్రిస్టియన్ ఫ్రంట్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇది ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహిస్తూ, కొన్ని ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలకు సహకరిస్తోంది. క్రైస్తవులను, ముస్లింలను విభజించడం ద్వారా లబ్ధి పొందాలని బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ ఉబలాటపడుతున్నాయి.



కేథలిక్ చర్చి అత్యున్నత నేత, కార్డినల్ జార్జి అలెన్ చెర్రీ, ఎర్నాకులం-అంగమలై ఆర్చిడియోస్ ఆర్చిబిషప్‌పై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు జరుపుతోంది. ఆర్చిడియోస్‌కి చెందిన ఆస్తుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆయనపై మనీ లాండరింగ్ కేసును ఇ.డి దాఖలు చేసింది. కఠినమైన విదేశీ విరాళాల నియంత్రణా చట్టాన్ని (ఎఫ్‌సిఆర్‌ఎ) అస్త్రంగా చేసుకోవడం ద్వారా కూడా ఒత్తిడి తెస్తున్నారు. దీని ద్వారా చారిటబుల్, విద్యా సంబంధ కార్యకలాపాల కోసం చర్చిలు అందుకునే విదేశీ నిధులను కోత పెట్టాలని చూస్తున్నారు. ఇటువంటి పద్ధతుల ద్వారా వివిధ చర్చిల నేతలను మెతకపరిచిన తర్వాత, ఇప్పుడు బెదిరింపులతో పాటూ కల్లబొల్లి మాటలు కూడా చెబుతున్నారు.

బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయాలకు అనుగుణంగా లేని ఎవరినైనా బెదిరించి, భయపెట్టి లొంగదీసుకోవడమనేది మోడీ ప్రభుత్వం అనుసరించే, పలుసార్లు ప్రయత్నించి విజయం సాధించిన పద్ధతి. ఇది రెండో వ్యూహం. కేరళలో చర్చి ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్ బిషప్ ధర్మరాజ్ వంటి చర్చిల్లో వివిధ స్థాయిల్లో వున్న నేతలు, కె.పి.యోహాన్, పాల్ దినకరన్ తదితర మత నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులు ప్రారంభమయ్యాయి.

కేథలిక్ చర్చి అత్యున్నత నేత, కార్డినల్ జార్జి అలెన్ చెర్రీ, ఎర్నాకులం-అంగమలై ఆర్చిడియోస్ ఆర్చిబిషప్‌పై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు జరుపుతోంది. ఆర్చిడియోస్‌కి చెందిన ఆస్తుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆయనపై మనీ లాండరింగ్ కేసును ఇ.డి దాఖలు చేసింది. కఠినమైన విదేశీ విరాళాల నియంత్రణా చట్టాన్ని (ఎఫ్‌సిఆర్‌ఎ) అస్త్రంగా చేసుకోవడం ద్వారా కూడా ఒత్తిడి తెస్తున్నారు. దీని ద్వారా చారిటబుల్, విద్యా సంబంధ కార్యకలాపాల కోసం చర్చిలు అందుకునే విదేశీ నిధులను కోత పెట్టాలని చూస్తున్నారు.

ఇటువంటి పద్ధతుల ద్వారా వివిధ చర్చిల నేతలను మెతకపరిచిన తర్వాత, ఇప్పుడు బెదిరింపులతో పాటూ కల్లబొల్లి మాటలు కూడా చెబుతున్నారు. కేథడ్రల్ చర్చిని మోడీ సందర్శించడాన్ని, కేరళలో చర్చి నేతలను బిజెపి నేతలు కలుసుకోవడాన్ని ఈ నేపథ్యం నుండే చూడాల్సి వుంది. తడి గుడ్డతో గొంతు కోసే ఈ వైఖరి క్రైస్తవ కమ్యూనిటీలో తాము చొచ్చుకుపోవడానికి ఉపకరిస్తుందని బిజెపి ఆశిస్తోంది. అయితే కేరళలో ఈ సందేహాస్పదమైన పాత్ర మిగిలిన భారతదేశంలో బిజెపి పాలన కింద క్రైస్తవులు ఎదుర్కొంటున్న దానికి పూర్తి భిన్నంగా వుంది.

2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, క్రైస్తవుల ఆరాధనా స్థలాలపై, క్రైస్తవ కమ్యూనిటీపై 5,82,774 దాడులు చోటుచేసుకున్నాయి. క్రైస్తవులపై హింస, వారి పట్ల శత్రు వైఖరి వంటి వాటికి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంలోనే వున్నాయి. ముస్లింలు, క్రైస్తవులు ఇరువురూ హిందూ సమాజానికి పరాయివారనేది ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. పైగా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సంచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ మూడు అంతర్గత ముప్పులు (ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు) వున్నాయని పేర్కొన్నారు.

భారతదేశంలో క్రైస్తవ జనాభా చాలా తక్కువ, దశాబ్దాలుగా ఈ జనాభా కూడా తగ్గుతూ వస్తోంది. 1971లో 2.53 శాతంగా వున్న క్రైస్తవులు, 1991కి వచ్చేసరికి 2.43 శాతానికి తగ్గారు. 2001లో 2.34 శాతంగా వుండగా, 2011లో గత జనాభా లెక్కల్లో 2.30 శాతానికి పడిపోయింది. ఇంత తక్కువ సంఖ్యలో వున్న జనాభా కూడా దేశంలోని పలు ప్రాంతాల్లో ముట్టడికి గురవుతున్నారు. క్రైస్తవులపై దాడులు 2022లో విపరీతంగా పెరిగాయని యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం (యుసిఎఫ్) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 21 రాష్ట్రాల్లో క్రైస్తవులపై 598 హింసాత్మక కేసులు నమోదయ్యాయి. 2018లో హింసాత్మక సంఘటనలు 292 వుండగా, 2019లో 328 కేసులు నమోదయ్యాయి. కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ కారణంగా 2020లో కేసులు తగ్గి 279గా నమోదయ్యాయి. తిరిగి 2021లో ఒక్కసారిగా కేసులు పెరిగి 505కి చేరుకున్నాయి. 2022 చివరి త్రైమాసికంలో చత్తీస్‌గఢ్‌లో క్రైస్తవ ఆదివాసీలపై విస్తృతంగా దాడులు జరిగాయి. ఆర్‌ఎస్‌ఎస్‌కి చెందిన వివిధ సంఘాలతో ఏర్పడిన జన్‌జాతి సురక్షా మంచ్ పేరుతో క్రైస్తవ వ్యతిరేక విషపూరిత ప్రచారం నిర్వహించబడింది. ఫలితంగా దక్షిణ చత్తీస్‌గఢ్ లోని మూడు జిల్లాల్లో విచ్చలవిడిగా దాడులు, హింస చోటు చేసుకున్నాయి. ఈ హింస, తమపై వివిధ రూపాల్లో అమలవుతున్న సామాజిక బహిష్కరణల కారణంగా వేలాదిమంది క్రైస్తవులు తమ గ్రామాలను వదిలివెళ్ళాల్సి వచ్చింది. చత్తీస్‌గఢ్ లోని క్రైస్తవ గిరిజనుల మీద జరిగిన దాడులపై ఆ ఏరియాల్లో పర్యటించిన సిపిఎం ప్రతినిధి బృందం రూపొందించిన సమగ్ర నివేదిక ప్రచురితమైంది.

క్రైస్తవ ఆదివాసీలను ఎస్‌టి రిజర్వేషన్ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని ఆదివాసీ సంఘాలు నిర్వహించిన ప్రచారం నేపథ్యంలోనే చత్తీస్‌గఢ్ లో క్రైస్తవ గిరిజనులపై దాడులను చూడాల్సి వుంది. గిరిజనుల్లో క్రైస్తవ మతానికి మారిన వారు రిజర్వేషన్‌కు అర్హులు కారని వారు వాదిస్తున్నారు. ఈ డిమాండ్ పర్యవసానాలు చాలా తీవ్రంగా వున్నాయి. ఉదాహరణకు, ఈశాన్య ప్రాంతంలోని పలు గిరిజన కమ్యూనిటీలు క్రైస్తవులే, ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఈ డిమాండ్ వల్ల వారు ఎస్‌టి హోదా కోల్పోతారు.

బలవంతంగా మత మార్పిడులకు ప్రయత్నిస్తున్నారనేది క్రైస్తవులపై మరో రూపంలో జరుగుతున్న దాడి. కేరళకు పక్కనే గల కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం "మత స్వేచ్ఛా హక్కు పరిరక్షణ చట్టం" పేరుతో నిరంకుశ మత మార్పిడి చట్టాన్ని తీసుకువచ్చింది. 2022 సెప్టెంబరులో దీన్ని ఆమోదించారు. ఈ చట్టంలో నిరంకుశ నిబంధనలు వున్నాయి. మత మార్పిడి జరిగిన వ్యక్తి కుటుంబానికి చెందని వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని బలవంతంగా మత మార్పిడికి పాల్పడ్డారనే ఆరోపణలపై చర్చిల్లోని మతాధిపతులను అరెస్టు చేయవచ్చు. రాష్ట్రంలోని చర్చిల్లో వివిధ స్థాయిల్లోని వ్యక్తులు ఈ చట్టానికి వ్యతిరేకంగా సమైక్యంగా నిరసన తెలియచేశారు. వీటి పరిష్కారం కోసం కోర్టుకు కూడా వెళ్ళారు.

కేంద్రంలోని బిజెపి పాలకుల నిరంతర ఒత్తిడి కారణంగా, కేరళలో కొంతమంది చర్చి నేతలు తలొగ్గారు, ఆర్చిబిషప్ జోసెఫ్, పాంప్లనీ ఆఫ్ ది తలస్సెరి ఆర్చిడియోసిస్ వంటి వారు రాజీ పడ్డారు. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ కార్డినల్ జార్జి అలెన్‌చెరీ సుప్రీంలో పెట్టుకున్న పిటిషన్ ఇటీవల తిరస్కరణకు గురైంది. జార్జి అలెన్‌చెరీ ఈస్టర్ సండే రోజున ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, మోడీ మంచి నేత అని వ్యాఖ్యానించారు. బిజెపి పాలనలో క్రైస్తవులు అభద్రతగా లేరని సెలవిచ్చారు.

కొంతమంది చర్చి నేతలు చేస్తున్న ఈ ప్రకటనలను మొత్తంగా చర్చి, క్రైస్తవ కమ్యూనిటీ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలుగా చూడడం తప్పే కాగలదు. కేథలిక్ చర్చిలో కొన్ని వర్గాలు పాంప్లనీ అభిప్రాయాలను తిప్పికొడుతున్నాయి. కేరళ లోని క్రైస్తవులు కేరళ సమాజంలో లోతుగా పాతుకుపోయిన లౌకిక కూర్పులో భాగంగానే వున్నారు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ యొక్క క్రైస్తవ వ్యతిరేక స్వభావం వారికి బాగా తెలుసు. దేశవ్యాప్తంగా గల క్రైస్తవుల అనుభవాలు కూడా వారికి తెలుసు. బిజెపి, హిందూత్వ శక్తుల ఈ ఎత్తుగడలను తిప్పికొట్టడానికి అవసరమైన చర్యలను వామపక్ష ఉద్యమం, కేరళ లోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన తీసుకుంటాయన్న నమ్మకం వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

అమన్

అమెరికా ఆర్థిక పెత్తనానికి సవాల్


అంతర్జాతీయం

రష్యా మీద పశ్చిమ దేశాల ఆంక్షలు కొనసాగుతుండగానే ఇండియాకి ఆయిల్ ఎగుమతులు కొనసాగుతున్నాయి. అది కూడా రూపాయిల్లోనే మారకం జరుగుతోంది. భారత్-రష్యా వాణిజ్యం రూపాయిల్లోకి మారడమే కాదు. తాజాగా మలేషియాతోనూ భారత వాణిజ్యం రూపాయిల్లోకి మళ్లుతోంది. ఇప్పటికే 13 దేశాలతో భారతీయ రూపాయిల్లోనే చెల్లింపులు జరుగుతున్నాయి. ఒక్క ఇండియా మాత్రమే కాదు. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పుడు మారకద్రవ్యం కోసం రిజర్వు కరెన్సీగా డాలర్ల ప్రాధాన్యత తగ్గించేస్తున్నాయి. ఇతర రూపాల్లో వాణిజ్యం ప్రారంభించాయి. రష్యా-చైనా, రష్యా-ఇరాన్ మధ్య వాణిజ్యం రష్యన్ రూబుళ్లలో మొదలై ప్రస్తుతం చైనీస్ యువాన్ల వైపు సాగుతోంది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలతో తమ వాణిజ్యం రూబుళ్లతో పాటుగా యువాన్లలో ఉంటుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించాడు. తాజాగా యూఏఈ కి చెందిన ఆయిల్ కంపెనీతో పాటుగా ఫ్రాన్స్ ఆయిల్ దిగ్గజ సంస్థలతోనూ చైనా తన కరెన్సీ లోనే మారకం జరిగేలా ఒప్పందం కుదర్చుకుంది. దాంతో డాలర్ భవిష్యత్ డోలాయమానంలో పడుతోంది. రష్యా, చైనా, ఇరాన్, బ్రెజిల్, కెన్యా, సౌదీ అరేబియా, యూఏఈ లతో పాటుగా ఆసియన్ దేశాలు కూడా ప్రత్యామ్నాయ కరెన్సీని ఆశ్రయిస్తున్నాయి. డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఆగస్టులో జరిగే బ్రిక్స్ సమావేశంలో లోకల్ కరెన్సీ వినియోగం గురించి చర్చిస్తామని ఇప్పటికే ప్రకటించారు. క్రమంగా కార్యరూపం దాల్చుతున్న డీడాలరైజేషన్ (డాలర్‌తో పనిలేదు) నినాదం అమెరికా ఆధిపత్యానికి గట్టి సవాల్ విసురుతోంది. డాలర్‌ను సాధనంగా చేసుకుని ఇన్నాళ్లూ ప్రపంచంపై పెత్తనం చెలాయిస్తూ వచ్చిన అమెరికాకు, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు గడ్డు పరిస్థితి తప్పదని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

రెండో ప్రపంచయుద్ధం అనంతరం అప్పటికే దెబ్బతిన్న యూరప్ దేశాలతో పాటు...కొత్తగా స్వాతంత్ర్యం సాధించిన మూడో ప్రపంచ దేశాల మీద ఆధిపత్యం కోసం...అమెరికా వేసిన ఎత్తుల్లో భాగంగా డాలర్ ప్రపంచ మారకరూపం దాల్చింది. తన పెత్తనాన్ని సహించని దేశాల మీద ఆంక్షలు విధించి అణచివేయడానికి లేదా తన దారికి తెచ్చుకోవడానికి కూడా డాలర్ ని వాడుకుంది.

అడ్డగోలు ఆంక్షలతో...

అమెరికా పెత్తనాన్ని సహించని ప్రభుత్వాలను అన్ని విధాలుగా అణిచేసే క్రమంలో డాలర్ కూడా ఓ ఆయుధమైంది. వివిధ దేశాల్లో సార్వభౌమత్వం కోసం నిలబడిన నేతలను, వారి ప్రభుత్వాలను వేధించేందుకు అమెరికన్ డాలర్లనూ



డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఆగస్టులో జరిగే బ్రిక్స్ సమావేశంలో లోకల్ కరెన్సీ వినియోగం గురించి చర్చిస్తామని ఇప్పటికే ప్రకటించారు. క్రమంగా కార్యరూపం దాల్చుతున్న డీడాలరైజేషన్ (డాలర్‌తో పనిలేదు) నినాదం అమెరికా ఆధిపత్యానికి గట్టి సవాల్ విసురుతోంది. డాలర్‌ను సాధనంగా చేసుకుని ఇన్నాళ్లూ ప్రపంచంపై పెత్తనం చెలాయిస్తూ వచ్చిన అమెరికాకు, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు గడ్డు పరిస్థితి తప్పదని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

వినియోగించింది. ఆయా దేశాల మీద ఆంక్షలు విధించి, డాలర్లు అందుబాటులో లేకుండా చేసి, వారిని తన దారికి తెచ్చుకునే యత్నాలు యథేచ్ఛగా సాగించింది. ఆ క్రమంలో మిలియన్ల కొద్దీ సామాన్యులు అత్యవసర సరుకులు కూడా అందకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నా తన పాశవికతను ప్రదర్శిస్తూనే వచ్చింది. నేటికీ వెనిజులా, ఇరాన్, సిరియా, జింబాబ్వే వంటి దేశాల మీద అమెరికా ఆంక్షల కారణంగా పిల్లలకు పాలు, ఇతర ఆహార పదార్థాలు కూడా లభించని స్థితిలో లక్షలాది మంది ఇక్కట్లు ఎదుర్కొంటూనే ఉన్నారు. తన దేశానికి చెందిన కరెన్సీని ప్రపంచ మార్కెట్ మూలాధారంగా మార్చేసి, ఆర్థిక ఆధిపత్యం చెక్కుచెదరకుండా చేసుకుంది. అంతకు ముందు క్యూబాని దిగ్బంధించి ఎంతగా వేధించిందో ప్రపంచానికి తెలుసు. అమెరికన్ ఆంక్షల కారణంగా నేటికీ క్యూబన్లకు ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి.

అమెరికా ఆర్థిక, రాజకీయ లక్ష్యాల సాధన కోసం డాలర్ ఓ ముడిసరుకు అయ్యింది. అమెరికా ఆంక్షల వల్ల ఇక్కట్లు ఎదుర్కొన్న ఆయా దేశాల్లో ప్రజలు తిరుగుబాట్లు ప్రోత్సహించడం, తమ తొత్తు ప్రభుత్వాలను అక్కడ నెలకొల్పి ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని, స్వాతంత్ర్యాన్ని హరించడమే లక్ష్యంగా సాగుతోంది. అమెరికా కుయుక్తుల సాధనలో డాలర్ విస్తృత పాత్ర పోషించింది.

రష్యా మీద ఆంక్షలతో...

అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించే శక్తులపై ఆంక్షలు విధించడం విస్తృతమవుతోంది. 1990లో పోలిస్తే 2021 నాటికి 933 శాతం మేర ఈ ఆంక్షల పరిధి పెరిగింది. ఉక్రెయిన్ పరిణామాలను సాకుగా చూపించి రష్యాని దిగ్బంధించాలని అమెరికా ఎత్తులు వేసింది. ఆర్థికంగా రష్యాని కట్టడి చేసేందుకు గాను ఆంక్షల పర్వానికి తెరలేపింది. రష్యా నుంచి గ్యాస్, చమురు దిగుమతులు చేసుకోకుండా ఈయూ దేశాలను నియంత్రించింది. అయినా అమెరికా ఆశించిన ఫలితాలు రాకపోయేసరికి ఇప్పుడు బెంబేలెత్తిపోతోంది. అందుకు ప్రధాన కారణం అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా తన దారి తాను చూసుకుంది. చివరకు అదే ఇప్పుడు అమెరికా ఆధిపత్యానికి సవాల్ అవుతోంది. డాలర్లకి బదులుగా వివిధ కరెన్సీల్లో తన ఎగుమతులకు ఆటంకం లేకుండా చూసుకునేందుకు రష్యా సిద్ధం కావడం అమెరికాకి ఛాలెంజ్‌గా మారింది. ఇప్పటికే ఇండియాకి రష్యా ఆయిల్ ఎగుమతులు పెరిగాయి. అది కూడా రూపాయిల్లోనే మారకం చేసుకునేందుకు ఇరు దేశాలు సిద్ధమయ్యాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతుల ధరల మీద కూడా అమెరికా ఆంక్షలున్నాయి. ఆ పరిధి మేరకు రష్యా చమురును చౌకగా అది కూడా రూపాయిల్లోనే కొనుగోలు చేస్తున్నప్పటికీ భారతీయులకు మాత్రం ధరల్లో ఊరట లేదు. అదే సమయంలో రష్యన్ ఆయిల్‌ని వివిధ దేశాలకు అమ్ముకుంటూ భారతీయ కంపెనీలు, ప్రభుత్వం కూడా భారీగా లాభాలు ఆర్జిస్తున్నాయి.

కేవలం ఇండియాతో సరిపెట్టకుండా తన ద్వైపాక్షిక వాణిజ్యంలో భాగంగా ఇరాన్, చైనా సహా అనేక దేశాలతో ఆయా స్థానిక కరెన్సీలను రష్యా అనుమతిస్తోంది. తాజాగా చైనీస్ కరెన్సీ యువాన్లలో లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల మధ్య వాణిజ్యానికి వాడబోతున్నట్టు ప్రకటించింది. ఇది డాలర్ కి అతి పెద్ద దెబ్బ. ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం 1990ల నాటికి ప్రపంచ వాణిజ్యం 87 శాతం అమెరికన్ డాలర్లలో జరిగేది. ప్రస్తుతం అది 65 శాతానికి పడిపోయింది. మరోవైపు ఫారిన్ రిజర్వు కరెన్సీగా డాలర్ స్థానంలో బంగారం, ఇతర ప్రత్యామ్నాయాల వైపు దేశాలు అడుగులు వేస్తున్నాయి. దాంతో మారక ద్రవ్య నిల్వల్లో 1970ల నాటికి 72 శాతం డాలర్ ఉంటే, 2021 నాటికి అది 59 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం మరింత పడిపోయి 50 శాతం లోపు ఉంటుందని అంచనా.

బహుళధ్రువ ప్రపంచం దిశగా...

ఏకధ్రువ ప్రపంచంలో తనకు తిరుగులేదని గడిచిన మూడు దశాబ్దాలుగా పెత్తనం చెలాయిస్తున్న అమెరికాకి ఈ పరిణామాలు అతి పెద్ద సమస్యగా మారబోతున్నాయి. త్వరలోనే బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) సమావేశం జరగబోతోంది. ప్రత్యామ్నాయ కరెన్సీ కోసం ప్రయత్నిస్తున్నామని ఇండియా మినహా మిగిలిన దేశాధినేతలంతా ప్రకటిస్తున్నారు. షాంఘై కేంద్రంగా బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ అధినేతగా బ్రెజిల్ మాజీ అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్ బాధ్యతలు స్వీకరించారు. చైనాతో వాణిజ్యానికి ప్రపంచంలోనే అనేక దేశాలు పోటీ పడుతున్నాయి. డాలర్ పెత్తనానికి ముగింపు పలికి బహుముఖ ప్రపంచం దిశగా ఈ పరిణామాలు సాగుతున్నాయి. అమెరికాతో సంబంధం లేకుండా ఇప్పటి వరకూ ఇండియా-బంగ్లాదేశ్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంలో కూడా డాలర్ ని వినియోగించాల్సి ఉండేది. కానీ ఇకపై అలాంటి అవసరం లేదంటూ ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్నారు.

అమెరికన్ కరెన్సీని ప్రపంచమంతా అంగీకరించాల్సిన స్థితి నుంచి ప్రధాన దేశాల కరెన్సీలకు సైతం మారకం విలువ దక్కడం ఆర్థిక, రాజకీయ రంగాల్లో కీలక మార్పులకు దారితీస్తుంది. జియో పాలిటిక్స్ లో కీలక పరిణామాలకు మూలం అవుతుంది. ఇప్పటికే అమెరికన్ ఆర్థిక రంగంలో ఈ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయి. అక్కడి రాజకీయాలను సైతం కదిలిస్తున్నాయి. మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైతం అమెరికా ఆధిపత్యానికి ప్రమాదం ముంచుకొచ్చిందని బహిరంగంగానే వాపోవాల్సి వచ్చింది. అమెరికాను ఖాతరు చేయాల్సిన అవసరం లేకుండా పోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ బిక్కుబిక్కుమంటుంటే మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అమెరికా దేశానికి పెను సవాళ్లు ఎదురవుతున్న స్థితిని ట్రంప్ మాటలు చాటుతున్నాయి. దాంతో ఈ వ్యవహారాలు డాలర్ ఆధిపత్యానికి పూర్తిగా గండికొట్టగలిగితే రెండో ప్రపంచ యుద్ధం నాటి నుంచి ఉన్న అమెరికా ఆధిపత్యం కోల్పోతుంది. ఇది గడిచిన దశాబ్దాల్లో ఊహించనిది. అమెరికా సైతం ఎన్నడూ తలచనిది. అందుకే అది అంత సులువుగా తన పెత్తనం వదులుకోవాడానికి సిద్ధంగా లేదనే సంకేతాలు తాజాగా ఫిన్లాండ్‌ని నాటోలో చేర్చుకోవడం ద్వారా పంపిస్తోంది. ఇటు దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్ కేంద్రంగా కొత్తగా సైనిక దళాల మోహరింపు ద్వారా చెబుతోంది. దాంతో ఇదంతా కీలక దశకు చేరినట్టు భావించాల్సి ఉంటుంది.

జనవాక్యం

చదువులో శాస్త్రీయత ఏదీ?

ఎంత చదువుకున్నా ఆచరణలో ఆటవికంగా ప్రవర్తిస్తున్నారు. రాకెట్ పైకి పంపే ఇస్రో చైర్మన్ ప్రతిసారీ ఆ పక్కనే ఉన్న చెంగాలమ్మకు దండం పెట్టిగానీ మొదలు పెట్టడు. యూనివర్సిటీ విద్యార్థులకు శాస్త్రీయ విద్య అందించాల్సిన వైస్ ఛాన్సలర్లు మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు. ఈ మధ్య అనంతపూర్ శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యాగం చేయబోయి...లౌకిక ప్రజాతంత్రవాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతోపాటు హైకోర్టు నుండి నోటీస్ వెళ్ళేటప్పటికి మానుకున్నాడు. బెనారస్ హిందూ యూనివర్సిటీ వారు ఆ మధ్య భూత వైద్యం కోర్సుగా పెట్టారు. కొన్ని యూనివర్సిటీల వారు ఆవు మూత్రంలో బంగారం ఎంత శాతం ఉందో పరిశీలిస్తున్నారు. ఎందుకంటే మూత్రం బంగారం రంగులో ఉంటుంది కాబట్టి. దాదాపు అన్ని జంతువుల మూత్రం అదే రంగులో ఉంటుంది. వీటన్నిటికీ కారణం వారు దేవుడు దెయ్యం, ఛాందస భావాలు కలిగి ఉండటం. వీటి నుండి బయటపడ లేకపోవడం. బాల్యం నుంచి శాస్త్రీయ విద్య అందకపోవడం. అందుకని ప్రాథమిక విద్య నుండి విద్యార్థులకు శాస్త్రీయమైన విద్య అందించాలి. పుక్కిటి పురాణాలు, మతపరమైన అంశాలు లేకుండా చూడాలి. అయితే ఇప్పటి బిజెపి ప్రభుత్వం కర్ణాటక, గుజరాత్, యూపీ లలో గీతను, పురాణాలను పాఠ్యాంశంగా బోధిస్తున్నది. దీన్ని ఆలోచనాపరులైన వారందరం ఎదుర్కోవాలి. లేకపోతే చాలా ప్రమాదం. ఈ దేశాన్ని మతమయం చెయ్యటానికి పెద్ద కుట్ర జరుగుతోంది. అభ్యుదయవాదులు, మేధావులు మేల్కొనాలి. ఈ విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

16న విచారణకు రండి

• కేజ్రీవాల్‌కు సిబిఐ సమన్లు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈ నెల 16న విచారణకు హాజరుకావాలని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సిబిఐ నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని అధికారులు శుక్రవారం వెల్లడించారు. సిబిఐ ప్రధాన కార్యాలయానికి ఈ నెల 16న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని, దర్యాప్తు బృందం అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సమన్లలో కేజ్రీవాల్‌ను సిబిఐ కోరింది. సిబిఐ సమన్ల గురించి ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి ఈ సిబిఐ సమన్లను ఒక కుట్రగా విమర్శించారు. 'ఢిల్లీ విధాన సభలో అదానీ అంశం గురించి కేజ్రీవాల్ మాట్లాడారు. అదే రోజున నేను చెప్పాను. తరువాత లక్ష్యం మీరేనని. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయం అయింది. ఇలాంటి నోటీసులతో అవినీతిపై కేజ్రీవాల్ పోరాటం ఆగదు' అని సింగ్ చెప్పారు.

మోడీజీ..మా కోసం బడి నిర్మించండి

• ప్రధానిని కోరిన జమ్మూకాశ్మీర్ చిన్నారి

కథువా : 'మోడీజీ...దేశం చెప్పేది వినండి' జమ్మూకాశ్మీర్‌లోని కథువా జిల్లా లోహై-మల్హర్ గ్రామానికి చెందిన ఓ చిన్నారి ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి అన్న ఈ మాటలు 'ఫేస్‌బుక్'లో వైరల్ అవుతున్నాయి. తమ కోసం ఒక మంచి పాఠశాలను నిర్మించాలని కూడా ప్రధానిని ఆ బాలిక సీరత్ నాజ్ కోరింది. కొందరు స్నేహితులతో కలిసి, అపరిశుభ్రంగా ఉన్న తరగతి గదిలో నేలపై కూర్చుని ఉన్న సీరత్ 'ఫేస్‌బుక్' మాధ్యమంగా ప్రధానికి విజ్ఞపనలు అందించింది. ఈ వీడియోను ఇప్పటికే 20 లక్షల మంది చూడగా, 1.16 లక్షల మంది లైక్ కొట్టారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తాను చదువుకుంటున్నానని ఐదు నిమిషాల నిడివి కలిగిన ఆ వీడియోలో విద్యార్థిని తెలిపింది. పాఠశాల అంతటా ఆమె కలియతిరుగుతూ సౌకర్యాల లేమిని ఏకరువు పెట్టింది. అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయింది.

రాజ్యాంగ పరిరక్షణ కోసం

పోరాటాలు తీవ్రతరం చేయాలి

• అంబేద్కర్ జయంతి సభలో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాలు బలోపేతం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపు ఇచ్చారు. రాజ్యాంగ రూపశిల్పి, స్వతంత్ర భారత తొలి న్యాయ మంత్రి బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం నాడిక్కడ పార్లమెంట్ స్ట్రీట్‌లో దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) ఆధ్వర్యంలో సభ జరిగింది. తొలిత సీతారాం ఏచూరి, బృంద కరత్, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ దేశ రాజ్యాంగ పరిరక్షణ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. పౌరులందరికీ సమాన హక్కులు ఉండే ప్రజాస్వామ్య భారతాన్ని అంబేద్కర్ కలలు కన్నారని పేర్కొన్నారు. కానీ దేశంలో అసమానతలు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని, దిగువన ఉన్న జనాభాలో 50 శాతం మంది సంపదలో 3 శాతం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. వర్గ పోలరైజేషన్ సృష్టించి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. దేశంలో అందరి ఓటు సమానమైనప్పటికీ అదానీలు, అంబానీలకు ప్రత్యేక రక్షణ లభిస్తుందని విమర్శించారు. కోట్లాది మంది పేదలుగా మారుతున్నారని, సామాజిక అన్యాయాన్ని పెంచే విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం జరగాలని



సీతారాం ఏచూరి అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను దోచుకోవడం, ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉద్యోగాల కోసం రిజర్వేషన్ ప్రయోజనాలను కోల్పోతున్నారు. సామాజిక అన్యాయాన్ని తొలగించేందుకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. సామాజిక న్యాయమనేది కేవలం ప్రకటనలకే మాత్రమే పరిమితం అయిందని విమర్శించారు. నిరుద్యోగం ప్రబలిందని, ద్రవ్యోల్బణం వల్ల నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని, ఎనిమిదేళ్లుగా కార్మికుల నిజమైన వేతనాలు పెరగలేదని ఏచూరి అన్నారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు బృంద కరత్ మాట్లాడుతూ 70 ఏళ్ల క్రితం అంబేద్కర్ చెప్పిన దానికి, ఇప్పుడు దేశంలో జరుగుతున్న దానికి సంబంధం ఉందని అన్నారు. ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ దేశంలో మోడీ సర్కార్ పాలన దళిత వ్యతిరేకంగా ఉందని అన్నారు. దళితులపై దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వ మద్దతుతో దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. డిఎస్ఎంఎం రాష్ట్ర కార్యదర్శి నత్తు ప్రసాద్ మాట్లాడుతూ దళితులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని అన్నారు. జననాట్య మంచ్ కార్యకర్తలు వీధి నాటకం ప్రదర్శించారు. పార్లమెంట్ స్ట్రీట్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఉపన్యాసాలు, కళా కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శన, ప్రదర్శన, భోజన పంపిణీ నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ దంకర్, ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ 132వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపి, తెలంగాణ భవన్ ప్రత్యేక ప్రతినిధి మందా జగన్నాధం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో అంబేద్కర్ సేవలను కొనియాడారు. రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, సమానత్వం కోసం శ్రమించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ (పిఆర్సి) ఆదిత్యానాద్ దాస్, అడిషనల్ రెసిడెంట్ కమిషనర్, స్పెషల్ కమిషనర్ ఎన్.వి రమణా రెడ్డి, ఎఆర్సి హిమాన్షు కౌశిక్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ (ఆర్ సి) గౌరవ్ ఉప్పల్, ఇరు భవన్ ల సిబ్బంది, పోలీసులు అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. తొలిత ఏపి భవన్ పిఆర్సీ, ఏఆర్సీ, తెలంగాణ భవన్ ఆర్సీలు జ్యోతి ప్రజ్వలన చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాజీ ఎంపి జె. వి. మహేశ్వర రావ్ పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రికి చెందిన చిన్నారులు సంగీత, నృత్య, సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు.

కర్ణాటకలో బిజెపికి ఎదురు దెబ్బలు

• పార్టీకి గుడ్‌బై చెబుతున్న నాయకులు

బెంగళూరు : కర్ణాటకలో శాసనసభ ఎన్నికల ముంగిట అధికార బిజెపికి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇప్పటి వరకూ విడుదలైన 212 మంది అభ్యర్థుల జాబితాలో 60 మంది సిటింగ్‌లకు చోటు దక్కలేదని సమాచారం. వీరిలో కొందరు ఇప్పటికే పార్టీకి రాజీనామా చేయగా మరికొందరు అదే బాట పట్టబోతున్నారు. చిక్‌మగళూర్ జిల్లా ముదిగెరె ఎస్సీ స్థానం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కుమారస్వామికి టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తుమకూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి శివన్నది కూడా ఇదే పరిస్థితి. ఆయన సైతం పార్టీని వీడారు. టికెట్ దక్కని కొందరు నాయకులు ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైపై విమర్శలు గుప్పిస్తున్నారు. హావేరి ఎమ్మెల్యే నెహ్రూ ఓలేకర్ తన మద్దతుదారులతో కలిసి నిరసనకు దిగారు. బెళగావి జిల్లా హుక్కెరిలో మాజీ మంత్రి శశికాంత్ నాయక్ టికెట్ నిరాకరణతో రాజీనామా చేశారు. అథానీ టికెట్ ఆశించి భంగపడిన ఎమ్మెల్సీ లక్ష్మణ్ సావడి, పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. టికెట్ దక్కని హోస్‌దుర్గ్ ఎమ్మెల్యే గులిహట్టి శేఖర్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.



సిపిఎం అభ్యర్థి ప్రచారం ప్రారంభం

బెంగళూరు: కర్ణాటకలోని కెఆర్ పురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి నంజేగౌడ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రచారాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ ప్రారంభించగా, ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కెఎన్ ఉమేష్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మీనాక్షి సుందరమ, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి నంజేగౌడకు మీనాక్షి సుందరమ బిఫాంను అందచేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాల నుంచి సిపిఎం పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.



బిల్లుల ఆమోదానికి కాలపరిమితి

కేంద్రాన్ని కోరాలని బిజెపియేతర సీఎంలకు స్టాలిన్ లేఖ

చెన్నై : శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదించేందుకు నిర్దిష్ట కాలపరిమితి విధించాలని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ అభిప్రాయపడ్డారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాల్సిందిగా బీజేపీ యేతర పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులను కోరారు. తమిళనాడు అసెంబ్లీలో దీనికి సంబంధించి కేంద్రానికి, రాష్ట్రపతికి విజ్ఞాపనలు చేస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. 'రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లకు పంపితే కొందరు వాటికి ఆమోదముద్ర వేయకుండా నిరవధికంగా పక్కన పెడుతున్నారు. దీనివల్ల కొన్ని విషయాలలో పాలన స్తంభిస్తోంది' అని లేఖలో స్టాలిన్ వివరించారు. గవర్నర్ల సందేహాలను నివృత్తి చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని చెప్పారు.

అమెరికన్ చట్ట సభ్యుడిపై చైనా ఆంక్షలు

బీజింగ్ : చైనా అంతర్గత వ్యవహారాల్లో తరచూ జోక్యం చేసుకునే, 'తైవాన్ ఇండిపెండెన్స్' వేర్పాటువాదులకు తప్పుడు సంకేతాలు పంపే అమెరికా ప్రతినిధుల సభ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్ మైఖేల్ మెకాల్‌పై చైనా గురువారం ఆంక్షలు విధించింది. మెకాల్ స్థిర, చరాస్తులను స్తంభింపచేయడంతో సహా ఈ అంక్షలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. చైనా విదేశీ వ్యతిరేక ఆంక్షల చట్టం ప్రకారం చైనాలోని ఏ సంస్థ లేదా వ్యకి కూడా మెకాల్‌తో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదు. చైనాలో ప్రవేశించకుండా, వీసా పొందకుండా నిషేధం విధించారు. మాటల పరంగా, చేతల పరంగా మెకాల్ తరచుగా చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వుంటారని చైనా విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. తద్వారా చైనా ప్రయోజనాలను దెబ్బతీస్తూ వుంటారని పేర్కొంది.

డాలర్‌కు చెక్ పెడదాం

• చైనా, బ్రెజిల్ నిర్ణయం

• బీజింగ్‌లో లూలా, జిన్‌పింగ్ భేటీ

బీజింగ్ : డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని, తద్వారా అమెరికా ప్రపంచ ఆధిపత్యానికి చెక్ పెట్టాలని రెండు అతి పెద్ద వర్ధమాన దేశాలైన చైనా, బ్రెజిల్ నిర్ణయించుకున్నాయి. చైనాలో నాలుగు రోజుల అధికార పర్యటన నిమిత్తం గురువారం నాడిక్కడకు చేరుకున్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వాతో చైనా నేత జీ జిన్‌పింగ్ శుక్రవారం బీజింగ్‌లోని ది గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్స్‌లో భేటీ అయ్యారు. బీజింగ్ వసంత కాలంలో పాత మిత్రుని కలుసుకోవడం తనకు ఎంతో ఆనందంగా వుందని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. కొత్తగా దేశాధ్యక్షుడిగా అధికారాన్ని చేపట్టినందుకు లూలాకు అభినందనలు తెలియచేశారు. అస్వస్థత కారణంగా తొలుత పర్యటన వాయిదా వేసుకున్నా, కోలుకున్న వెంటనే ఇంత సుదూరం ప్రయాణించడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి లూలా ఇచ్చిన ప్రాధాన్యతను జిన్‌పింగ్ అభినందించారు. చైనా, బ్రెజిల్ రెండూ అతిపెద్ద వర్ధమాన దేశాలని, తూర్పు, పశ్చిమ అర్ధగోళాల్లో అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లని జిన్‌పింగ్ పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వాములుగా చైనా, బ్రెజిల్‌లు విస్తృతమైన ఉమ్మడి ప్రయోజనాలను పంచుకుంటున్నాయని అన్నారు. వ్యూహాత్మక, దీర్ఘకాలిక కోణంలో బ్రెజిల్‌తో సంబంధాలను అభివృద్ధిపరుచుకోవాలని చైనా ఎప్పుడూ భావిస్తుందన్నారు. ఆ దేశంతో సంబంధాలకు తమ దౌత్య ఎజెండాలో అధిక ప్రాధాన్యత వుంటుందన్నారు. లూలాతో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా వున్నానని జిన్‌పింగ్ చెప్పారు. కొత్త శకంలో ఇరు దేశాల మధ్య సంబంధాలకు కొత్త భవితవ్యాన్ని సృష్టించేందుకు సిద్ధంగా వున్నామన్నారు. తద్వారా ఇరు దేశాల ప్రజలకు మరిన్ని ప్రయోజనాలను చేకూరుస్తామన్నారు.

చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) 20వ మహాసభ నిర్దేశించిన మార్గదర్శకాలను పూర్తి స్థాయిలో అమలు చేసే మొదటి సంవత్సరం ఇదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ ఆధునిక సోషలిస్టు దేశంగా చైనాను తీర్చిదిద్దేందుకు జరిగే సంఘటిత కృషికి సిపిసి నేతృత్వం వహిస్తోంది. ఈ కొత్త ప్రయాణంలో చైనా అత్యంత నాణ్యత కలిగిన అభివృద్ధి క్రమాన్ని అనుసరిస్తుందని, నూతనఅభివృద్ధి పంథాను ఏర్పాటు చేసే క్రమాన్ని వేగిరపరుస్తుందని, అత్యంత ఉన్నతమైన ప్రామాణికాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల బ్రెజిల్‌కు, ఇతర దేశాలకు కొత్త అవకాశాలు కల్పించబడతాయన్నారు. చైనా-బ్రెజిల్ సంబంధాలు ఇలాగే మరింత ధృఢంగా, స్థిరంగా వృద్ధి చెందగలవన్న విశ్వాసాన్ని జిన్‌పింగ్ వ్యక్తం చేశారు. తద్వారా తమ తమ ప్రాంతాల్లో శాంతి సుస్థిరతలు, సంక్షేమంలో కీలకమైన, సానుకూలమైన పాత్ర పోషించగలవని అన్నారు.

అమెరికా వైఖరిని గుడ్డిగా అనుసరించలేం !

• యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుని వ్యాఖ్యలు

పారిస్ : అమెరికాతో సంబంధం లేకుండా 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' సాధించడం కోసం ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ చేస్తున్న ప్రయత్నాలకు యురోపియన్ నేతలనుండి రాన్రాను మద్దతు పెరుగుతోందని యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్ తెలిపారు. అమెరికా అనుచరులుగా మారేందుకు వస్తున్న ఒత్తిడిని యూరప్ ప్రతిఘటించాలని మాక్రాన్ చేసిన వ్యాఖ్యలను మరింతమంది యురోపియన్ నేతలు సమర్ధిస్తున్నారని మైఖేల్ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన పొలిటికో న్యూస్ సర్వీస్‌తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "అమెరికాతో సంబంధాల అంశంపై యురోపియన్ కౌన్సిల్ టేబుల్ చుట్టూ అనేక సూక్ష్మ అంశాలు, సున్నితమైన అంశాలు వున్నాయనేది సుస్పష్టం. వాస్తవానికి కొద్దిమంది మాక్రాన్‌లా ఆలోచిస్తున్నారని భావిస్తున్నాను" అని మైఖేల్ పేర్కొన్నారు. నిజానికి అమెరికాతో గొప్ప అనుబంధం వుంది. కానీ అదేమీ లేదని మాక్రాన్ అంటున్నారు. అయితే, అమెరికాతో ఈ పొత్తు వున్నా యురోపియన్ యూనియన్ గుడ్డిగా, వ్యవస్థాగతంగా అన్ని విషయాల్లోనూ అమెరికా వైఖరిని అనుసరించలేదని ఆయన స్పష్టం చేశారు.

సిరియా, సౌదీల సంబంధాల పునరుద్ధరణకు యత్నాలు

డమాస్కస్ : సిరియా, సౌదీ అరేబియాలు సంబంధాలను పునరుద్ధరించుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. దశాబ్ద కాలంలో మొదటిసారిగా రెండు దేశాల మధ్య విమానాల రాకపోకలను పునరుద్ధరించేందుకు, ఎంబసీలను తిరిగి తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఉభయ పక్షాలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. 2011లో అరబ్ లీగ్ నుండి సిరియా సస్పెండ్ అయింది. ఆ తర్వాత ఏడాదికి సిరియాలో ప్రచ్ఛన్న యుద్ధం చెలరేగడంతో సౌదీ అరేబియా దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకుంది. టర్కీ, సిరియాల్లో ఫిబ్రవరి 6న తీవ్ర భూకంపం సంభవించిన నేపథ్యంలో సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నాలు వూపందుకున్నాయి. చైనా మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదిరింది. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చల నిమిత్తం సిరియా విదేశాంగ మంత్రి ఫైజల్ మికద్ నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం సౌదీ అరేబియా చేరుకుంది. వచ్చే నెల్లో అరబ్ లీగ్ సమావేశానికి సౌదీ అరేబియా ఆతిథ్యం ఇస్తోంది. ఆ సమావేశంలో సిరియా సభ్యత్వాన్ని పునరుద్ధరించే అంశం చర్చకు వస్తుందని భావిస్తున్నారు.





మీ కోసం


ఎక్కువ మొత్తంలో నూనె వేడి చేసినప్పుడు అడుగుభాగంలో మాడిపోయి ఉంటుంది. దాన్ని తొలగించాలంటే రెండు, మూడు వెల్లుల్లి రెబ్బలు వేసి వేడిచేయాలి. ఆ మాడు అంతా వెల్లుల్లికి అతుక్కున్న తరువాత వాటిని తీసేస్తే నూనె శుభ్రపడుతుంది.

జీవన సౌరభం

జీవితంలో అన్ని మెట్లూ ఒకే అడుగులో ఎక్కాలనుకునే దానికన్నా ఒక్కొక్క మెట్టు ఎక్కాలనుకోవడం ఉత్తమం, సులభం.

JEEVANA జీవన the family

అపకారికి ఉపకారం




అనగనగా ఒక అడవిలో పావురం, చిలక స్నేహంగా ఉండేవి. ఒక రోజు అడవికి ఒక వేటగాడు వచ్చాడు. చిలకను చూశాడు. చాలా బాగుందనుకున్నాడు. ఎలాగైనా దానిని పట్టి ఎక్కువ ధరకు అమ్మాలనుకున్నాడు. ఆ డబ్బుతో ఈ పని మానేసి వేరే ఉపాధి చూసుకోవాలని ఆశపడ్డాడు.

చిలకను పట్టుకుందామని చాలా ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాలేదు. చిలకను పట్టాలని అతడు భావించినప్పుడల్లా పావురం ఏదో రూపంలో దానిని కాపాడుతోంది. ఓసారి వేటగాడు వల విసురుతున్నప్పుడు చిలుక ఉన్న చోటుకు ఒక జామ పండు విసిరింది. చిలక వెంటనే ఆ పండును తిందామని ఎగిరిపోయింది. ఆ విధంగా వలకు చిక్కకుండా తప్పించుకొంది. దీంతో, వేటగాడు నిరాశగా ఇంటికి వెళ్లిపోయాడు.

కొన్నాళ్ల తరువాత వేట కోసం వచ్చిన వేటగాడు మీదికి పొంచి ఉన్న సింహం దాడి చేయబోయింది. అప్పుడు చిలక, పావురం గట్టిగా అరచి వేటగాడిని అప్రమత్తం చేశాయి. దాంతో వేటగాడు వేగంగా చెట్టెక్కి తప్పించుకున్నాడు. చిలుక- పావురాళ్ల సహాయం మరవలేనిదని గ్రహించాడు. ప్రాణం విలువ ఎంత గొప్పదో తెలుసుకొని ఇక వేటాడరాదని నిర్ణయించుకున్నాడు.



- బి . శ్రీజ
6వ తరగతి, రాయిలాపూర్,
మెదక్ జిల్లా,
94417 62105.



దారి చూపండి

చిన్నారులూ, వేర్వేరు చోట్ల ఉన్న రెండు సీతాకోక చిలుకలు కలుసుకోవాలి. మరి వాటికి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- చొప్పరి సంజన, 7వ తరగతి,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒక్కోసారి చాలా చిన్న చిన్న పనులే ఎంతో గొప్ప విషయాన్ని తెలియజేస్తాయి. ఇప్పుడు మనం చెప్పకుంటున్న విషయాలు చాలా సాధారణమైనవే.. కానీ అవి ఎంతో గొప్ప విషయానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. రంజాన్ మాసం సందర్భంగా ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో ఓ హిందూ సోదరుడు ముస్లిం కుటుంబాల పట్ల చూపిస్తున్న సామరస్య ధోరణి, కేరళలో ఓ రెండు ఆలయాల ముంగిట కొంతమంది హిందూ యువత ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ భోజనాలు దేశంలో అనాదిగా నెలకొన్న మతసామరస్యానికి గొప్ప అర్థం చెబుతున్నాయి.

సామరస్య చిహ్నాలు..

ఉత్తరప్రదేశ్ అజమ్‌ఘర్ జిల్లా కౌరియా గ్రామంలో నివసిస్తున్నాడు గులాబ్ యాదవ్. రంజాన్ మాసం ప్రారంభమైనప్పటి నుండి రోజూ అర్ధరాత్రి 1 గంటకు ఒక చేతితో లాఠీ, మరో చేతితో లాంతరు పట్టుకుని వీధీ వీధికి తిరుగుతూ ప్రతి గుమ్మాన్ని కొడుతున్నాడు. ఇంటి యజమానిని పేరుతో పిలిచి 'సెహ్రీ'కి సిద్ధమవ్వండని చెబుతున్నాడు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు పాటించే సుదీర్ఘ 'రోజా' ఉపవాస దీక్షకు ప్రారంభ సమయమే 'సెహ్రీ'. ఉపవాసం చేసే ముస్లిం సోదరుల (రోజ్‌దారీస్) మొత్తం రోజాలో ఈ సమయం చాలా కీలకంగా ఉంటుంది. అందుకే గులాబ్ అలా అర్ధరాత్రి సమయంలో గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క ముస్లిం కుటుంబాన్ని నిద్ర లేపుతున్నాడు. ఆ ఊళ్లో మొత్తం 200 ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. ఏ ఒక్క కుటుంబాన్నీ అతను విస్మరించడు.



అసలు గులాబ్‌కు ఈ అలవాటు ఎక్కడ నుండి వచ్చిందని అడిగితే.. 'గులాబ్ తండ్రి చిర్కిట్ యాదవ్, ఈ విధంగా ముస్లిం సోదరులను నిద్రలేపడం 1975 నుండి ప్రారంభించి'నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అంటే 48 ఏళ్లుగా ఇది కొనసాగుతోంది. చిర్కిట్ తరువాత అతని కొడుకు గులాబ్ దీన్ని కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం గులాబ్‌తో పాటు అతని కొడుకు కూడా తండ్రితో కలసి వస్తున్నాడు. భవిష్యత్తులో తాత, తండ్రుల వారసత్వాన్ని అతను కొనసాగించవచ్చని ఆ ముస్లిం కుటుంబాలు భావిస్తున్నాయి. 'కొన్ని దశాబ్దాలుగా రంజాన్ మాసమంతా గులాబ్ ఇలాగే చేస్తున్నాడు. అతనేమీ ధనవంతుడు కాదు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబానికి చెందినవాడు. పనుల కోసం వలస వెళ్లిపోతుంటాడు. రంజాన్ మాసంలో గ్రామానికి చేరుకుంటాడు. గులాబ్ రావడం వల్లే మేము నిద్రలేస్తామని చెప్పడం కాదుగాని అతను మా పట్ల చూపిస్తున్న ఆదరణకు మేం ఎంతో సంతోషిస్తామ'ని చెబుతున్నాడు ఓ ముస్లిం సోదరుడు. 'ఓ సారి రంజాన్ మాసంలో గులాబ్ మేనల్లుడి పెళ్లి ఉంది. అయినా అతడు వెళ్లకుండా గ్రామంలోనే ఉండిపోయి సేవ చేశాడు' అంటూ గతంలో జరిగిన సంఘటనను గుర్తుచేసుకున్నాడు మరో ముస్లిం సోదరుడు. 'హిందూ, ముస్లిం ఎల్లప్పుడూ కలసిమెలసి ఉండాలని మా నాన్న ఇలా చేశాడు. ఇది చాలా చిన్న పనే.. కాని ఆ కుటుంబాలు నన్నెంతో గౌరవిస్తాయి.. ప్రేమగా పలకరిస్తాయి.. వారి ఇంట్లో సభ్యుడిగా భావిస్తాయి. వారి ఆదరణ చూసి నాకు చాలా సంతోషమేస్తుంది' అని చెబుతున్నాడు గులాబ్ యాదవ్.



దేవాలయాల ఎదుట ఇఫ్తార్..

కేరళ మలప్పురంలో రెండు హిందూ దేవాలయాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆలయాల ఎదుట ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తిరూర్‌కు సమీపంలోని శ్రీ పుతువిప్పు మనలియర్కవు భగవతి ఆలయం, శ్రీ మహా విష్ణు ఆలయం మార్చి 28, ఏప్రిల్ 7న ఈ విందు ఇచ్చాయి. ఈ రెండు విందుల్లో ముస్లిం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'ఇదంతా స్థానికంగా ఉన్న యువత ప్రోద్బలం వల్లే జరిగింది. హిందూ-ముస్లిం మధ్య ఐక్యమత్యం నెలకొల్పడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటుచేశాం. ఇక్కడ ప్రతి పండుగను ఉత్సాహంగా, శాంతియుతంగా నిర్వహిస్తూ.. మత సామరస్యం ప్రతిబింబించేలా చేస్తున్నాం' అంటున్నారు ఆలయ కమిటీ సెక్రటరీ క్రిష్ణన్. 'మా ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఓ ముస్లిం సోదరుడు అన్నదానం చేయమని పెద్దఎత్తున విరాళం అందించారు. గతేడాది కూడా వార్షికోత్సవ సమయంలోనే రంజాన్ మాసం ప్రారంభమైంది. అయితే మేం ఏర్పాటు చేసిన అన్నదానానికి ముస్లిం సోదరులు ఎవ్వరూ హాజరుకాలేదు. అందుకే ఈ ఏడాది వారి కోసం ప్రత్యేకంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాం. వచ్చే ఏడాది కూడా రంజాన్ మాసంలోనే మా వార్షిక రోజు వస్తే ఇలాగే ఏర్పాటు చేస్తాం' అంటూ చెబుతున్నాడు మరో ఆలయ కమిటీ సభ్యులు లక్షణ్.

వ్యక్తులుగా.. సమిష్టిగా.. ఎలాగైతేనేం ఎవరికి తోచిన విధంగా వారు మత సామరస్యం పరిఢవిల్లేలా బృహత్తర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం మతవిద్వేషాలు రెచ్చగొట్టే మూకలు పెట్రేగిపోతున్న కాలంలోనే.. ముసలి వాడైన గులాబ్, యువకులైన ఆలయ కమిటీ సభ్యులు అవలంబించిన ఈ సామరస్య విధానం గొప్పది, నేడు చాలా అవసరమైనది.



వట్టి వేరు .. ఇలా వాడి చూడు ...

సాధారణంగా ఎండాకాలంలో ఇల్లు చల్లదనం కోసం వట్టి వేళ్లతో చేసిన చాపలు వాడుతుంటారు. కొబ్బరి నూనెలో వేసుకుని కూడా కొంతమంది ఉపయోగిస్తుంటారు. వీటిని ఆహారంలో కూడా భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ వేర్లలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా ఔషధాల్లో వాడతారని వైద్యులు చెబుతున్నారు.

- వట్టివేరుతో షర్బత్ తయారుచేసుకుని తాగడం వల్ల ఎండాకాలం తరచూ వచ్చే కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి తగ్గుతాయి.
- నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మెదడుకి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.
- వట్టివేరు సారం శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. సువాసన భరితంగా ఉండడం వల్ల ఒత్తిడి కూడా దూరమవుతుంది.
- నిద్రలేమిని పోగొట్టి జీర్ణ సమస్యలని దూరం చేస్తుంది..
- తలనొప్పితో బాధపడుతుంటే ఈ వేర్లని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగొచ్చు. వేర్లని మెత్తని పేస్టులా నూరి దానిని తలపై పట్టిలా వేసుకుని కాసేపయ్యాక శుభ్రం చేసుకున్నా తలనొప్పి తగ్గిపోతుంది.
- వేర్లని ఓ గ్లాసులో వేసి ఓ నాలుగైదు గంటలు లేదా రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ సమస్య దూరమవుతుంది.
- కుండనీళ్లు వాడేవారు ఈ వట్టివేరుని ఓ తెల్లని వస్త్రంలో మూట కట్టి ఆ నీటిలో వేయాలి. రెండు, మూడ్రోజులకి ఓసారి వట్టివేరును మార్చుకోవాలి.
- కుండ నీటిలో నానబెట్టిన వట్టివేర్లని పారేయకుండా దానిని మెత్తగా నూరుకొని ప్యాక్‌లా ముఖానికి వేసుకోవచ్చు. దీంతో ముఖంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవుతాయి.
- వట్టివేర్లని నీటిలో వేసి మరిగించి స్నానానికి వాడే నీటిలో కలిపి స్నానం చేస్తే చెమట వాసన దూరమవుతుంది.




విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్; సిపిఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం, వి శ్రీనివాసరావు, కె. రామకృష్ణ; పి. మధు, సిహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్ తదితరులు



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంవద్ద అంబేద్కర్ విగ్రహం నుండి మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం(ఎంబివికె) వరకు సాగిన బైక్ ర్యాలీ

'కేజిఎఫ్-3' ఉంది...




కన్నడ చిత్రం కేజీఎఫ్ విడుదలై సంచల నాలు సృష్టించింది. కేజీఎఫ్-2 విడుదలై సంవత్స రం అయ్యింది. ఈ క్రమంలో చిత్రబందం కేజీఎఫ్ సెకండ్ పార్ట్‌కి సంబంధించిన ఓ వీడియోను పోస్ట్ చేస్తూ.. అందులోనే పార్ట్-3కి సంబంధిం చిన హింట్‌ను ఇచ్చింది. 'అమ్మకిచ్చిన వాగ్దానం నెరవేరుతుంది. నిజంగా నెరవేరిందా? అంటూ వీడియోలో పార్ట్-3 ఖచ్చితంగా ఉంటుందని స్పష్టం చేశారు.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' పోస్టర్ విడుదల

సుహాస్ హీరోగా చేస్తున్న తాజా సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాని బన్నీ వాసు, దర్శకుడు వెంకటేష్ మహా ప్రెజెంట్ చేస్తున్నారు. దుశ్యంత్ కటికనేనిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు. షూటింగ్ పనులను ముగించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్న ఈ సినిమా నుండి తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సినిమాకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

సన్‌రైజర్స్‌కు మరో విజయం

సెంచరీతో కదం తొక్కిన బ్రూక్
కోల్‌కతాపై 23పరుగుల తేడాతో గెలుపు



హారీ బ్రూక్ (100నాటౌట్; 55బంతుల్లో 12ఫోర్లు, 3సిక్సర్లు)

కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. ఈడెన్ గార్డెన్స్‌లో వేదికగా జరిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 23 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత హైదరాబాద్ ఓపెనర్ హారీ బ్రూక్స్ అజేయ సెంచరీతో కదం తొక్కడంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 228పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో కోల్‌కతా జట్టు చివరివరకు పోరాడి 20ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 205పరుగులే చేయగల్గింది. తొలుత టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ మయాంక్ అగర్వాల్(9)కి తోడు త్రిపాఠి(9) నిరాశపరిచారు. మరో ఓపెనర్ హారీ బ్రూక్స్ క్రీజ్‌లో నిలదొక్కుకున్నా.. కెప్టెన్ మార్‌క్రమ్(50; 26బంతుల్లో 2ఫోర్లు, 5సిక్సర్లు) పరుగుల వేట మొదలు పెట్టాడు. ఐపిఎల్ మినీ వేలంలో ఇంగ్లండ్ ఆటగాడు హారీ బ్రూక్‌కు లభించిన ధర రూ.13.25 కోట్ల ధరకు న్యాయం చేస్తూ ఈ సీజన్‌లో తొలిసారి బ్యాట్‌కు పని చెప్పాడు. కోల్‌కతా బౌలర్లను వారి సొంతగడ్డపైనే తుత్తునియలు చేస్తూ 24ఏళ్ల బ్రూక్ కేవలం 55 బంతుల్లో 12 ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 100 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో ఆఫ్ సైడ్ కొట్టిన సిక్సులు ఇన్నింగ్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. మరో ఎండ్‌లో కెప్టెన్ మార్‌క్రమ్ కూడా అర్ధసెంచరీతో మెరిసాడు. ఇక అభిషేక్ శర్మ 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 32 పరుగులు చేశాడు. ఆఖర్లో హెన్రిచ్ క్లాసెన్ 6 బంతుల్లో 16 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 228 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో ఐపిఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ రెండో అత్యధిక స్కోర్‌ను ఈడెన్ గార్డెన్స్‌లో నమోదు చేసింది. కోల్‌కతా బౌలర్లలో ఆండీ రస్సెల్‌కు మూడు, వరుణ్ చక్రవర్తికి ఒక వికెట్ లభించాయి.

ఛేదనలో కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా(75), రింకూ సింగ్(58), జగదీశన్(38) మాత్రమే బ్యాటింగ్‌లో మెరిసారు. గుర్బాజ్(0), నరైన్(0), ఆండీ రస్సెల్(3) నిరాశపరిచారు. చివరి ఓవర్లో కోల్‌కతా 32పరుగులు చేయాల్సిన రాగా.. 8పరుగులే చేసి ఓటమిపాలైంది జాన్సెన్, మార్కండేకు రెండేసి, భువనేశ్వర్, నటరాజన్, ఉమ్రన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రూక్స్‌కు లభించింది.

ఐపిఎల్‌లో నేడు..
బెంగళూరు × ఢిల్లీ
(వేదిక: బెంగళూరు, మ.3.30గం॥లకు)
పంజాబ్ × లక్నో
(వేదిక: లక్నో, రా.7.30గం॥లకు)

జూన్‌లో భారత పర్యటనకు ఆఫ్ఘనిస్తాన్

ముంబయి: ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు భారత పర్యటనకు రానున్నట్లు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ తర్వాత ఈ సిరీస్ జరగనుంది. భారత్ వేదికగా జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్‌ముందు ఈ సిరీస్ భారత్‌లో జరగనున్నడంతో భారతజట్టుకు ప్రాక్టీస్‌కు ఈ సిరీస్ దోహదపడనున్నట్లు బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది. బిసిసిఐ కార్యదర్శి జే షా ఇరుదేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఈ సిరీస్‌కు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఐసిసి ఫ్యూటర్ టూర్ ప్రోగామ్‌లో ఈ సిరీస్‌ను చేర్చబడలేదని, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రావిడ్‌లతో చర్చించిన అనంతరమే ఈ టూర్‌కు షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఆయన తెలిపారు. జూన్ 16న డబ్ల్యుటిసి ఫైనల్ మ్యాచ్ ముగిసిన అనంతరం ఈ షెడ్యూల్ ఉండనున్నట్లు వెల్లడించారు. ఇక స్టార్ ఇండియాతో మార్చి నెలాఖరుతో ఒప్పందం ముగియడంతో ఈ సిరీస్ కోసం బిసిసిఐ విడిగా టెండర్లను ఆహ్వానిస్తుందా? లేక తర్వాత నాలుగేళ్లకు మీడియా హక్కులకు టెండర్లను ఆహ్వానిస్తుందా? అనే విషయంపై స్పష్టత రానుంది.


సెమీస్‌కు ఫ్రిట్జ్, రుబ్లేవ్
మెద్వదెవ్, సిట్సిపాస్ ఔట్..
మోంటేకార్లో ఓపెన్



మొనాకో: మోంటేకార్లో ఓపెన్ 1000 టెన్నిస్ టోర్నమెంట్ సెమీఫైనల్లోకి రుబ్లేవ్ (రష్యా), ఫ్రిట్జ్(అమెరికా) ప్రవేశించారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఆండీ రుబ్లేవ్ 6-1, 7-6(7-5)తో లెనార్డ్ స్ట్రఫ్(జర్మనీ)పై వరుససెట్లలో నెగ్గాడు. మరో పోటీలో హోల్జర్ రూనే(డెన్మార్క్) 6-3, 6-4తో టాప్‌సీడ్ డానియేల్ మెద్వదేవ్(రష్యా)పై, ఫ్రిట్జ్ 6-2, 6-4తో 2వ సీడ్ స్టెఫోనాస్ సిట్సిపాస్(గ్రీక్)పై గెలుపొందారు. ఇక జన్నిక్ సిన్నర్(ఇటలీ) 6-2, 6-2తో సహచర ఆటగాడు మసెట్టిని ఓడించి వరుసగా మూడో ఏటిపి టూర్ సెమీస్‌కు చేరాడు.

సెమీఫైనల్స్..
హోల్జర్ రూనే × జన్నిక్ సిన్నర్
ఆండీ రుబ్లేవ్ × టేలర్ ఫ్రిట్జ్

బార్సిలోనా ఓపెన్‌కు నాదల్ దూరం



మాడ్రిడ్: బార్సిలోనా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌కు స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ దూరమయ్యాడు. నాదల్ శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా 'బార్సిలోనా నాకు ప్రత్యేకమైన టోర్నమెంట్, ఈ క్లబ్‌ను నేను దత్తత తీసుకున్నాను. ఈ టోర్నమెంట్‌లో ఆడడం ఎప్పుడూ ప్రత్యేకమే.. కానీ నేను మానసికంగా ఇంకా సిద్ధం కాలేదు. అందువల్లే ఈ టోర్నీనుంచి వైదొలుగుతున్నా' అని పేర్కొన్నాడు. ఎడమ తుంటికి గాయం కారణంగా ఈ ఏడాది జనవరిలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ నుంచి నాదల్ రాకెట్ పట్టలేదు. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను నాదల్ రికార్డుస్థాయిలో 14సార్లు చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. అలాగే కెరీర్‌లో తొలిసారి ఏటిపి ర్యాంకింగ్స్‌లోనూ టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయాడు. ఏటిపి-500 బార్సిలోనా ఓపెన్ ఏప్రిల్ 15-23వరకు స్పెయిన్ వేదికగా జరగనుంది. 2005లో నాదల్ బార్సిలోనా ఓపెన్‌ను తొలిసారి చేజిక్కించుకొని మొత్తం 12సార్లు ఈ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68